తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

సంపుటి : 23 సంచిక : 85 | సోమవారం మార్చి 10 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల -5

## అందరూ లాభపడ్డారు.. నాకు మాత్రం రూపాయి ఇవ్వలేదు: నటి

మిగతాది 8లో

### ఇదండీ..కబురు..




మీరేం వర్రీకాకండి సార్.. అన్ని ఫైళ్లను ఒక పెద్ద ఫైల్‌లో కుక్కేశా.. ఇప్పుడున్నది ఒకే పెండింగ్ ఫైల్!

## న్యూజిలాండ్‌పై ఘన విజయం..

# టీమ్ఇండియాదే ఛాంపియన్స్ ట్రోఫీ

**న్యూజిలాండ్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో టీమ్ఇండియా విజయం సాధించింది.**




దుబాయ్: టీమ్ఇండియా అదరగొట్టింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని భారత్ ఆరు బంతులు మిగిలుండగానే 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రోహిత్ శర్మ (76బీ 83 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. విరాట్ కోహ్లీ (1) తీవ్ర నిరాశపర్చాడు. శ్రేయస్ అయ్యర్ (48బీ 62 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (34లి), శుభ్‌మన్ గిల్ (31), అక్షర్ పటేల్ (29), హార్దిక్ పాండ్య (18), రవీంద్ర జడేజా (9లి) పరుగులు చేశారు. భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడం ఇది మూడోసారి. 2002లో శ్రీలంకతో కలిసి సంయుక్త విజేతగా నిలవగా.. 2013లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఛాంపియన్‌గా అవతరించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ బ్యాటర్లలో డారిల్ మిచెల్ (63), మైకేల్ బ్రాస్‌వెల్ (53లి) రాణించారు. రచిన్ రవీంద్ర (37), గ్లెన్ ఫిలిప్స్ (34), ఫర్వాలేదనిపించారు. విల్ యంగ్ (15), కేన్ విలియమ్సన్ (11), టామ్ లేథమ్ (14), మిచెల్ శాంట్నర్ (8) పరుగులు చేశారు. నాథన్ స్మిత్ 0 (1) నాటౌట్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 2, వరుణ్ చక్రవర్తి 2, రవీంద్ర జడేజా, షమి చెరో వికెట్ పడగొట్టారు.



## చేనేత కార్మికుల రుణమాఫీ పథకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- రాష్ట్రంలో చేనేత కార్మికుల రుణమాఫీ పథకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి09:
తెలంగాణలో చేనేత కార్మికుల రుణమాఫీ పథకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చేనేత కార్మికులకు రూ.33 కోట్ల రుణమాఫీకి ప్రాథమిక అనుమతులు మంజూరు అయ్యాయి. ఈ పథకం ద్వారా చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుంది. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్న రుణ బకాయిలను మాఫీ చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.





# ఇలాంటి స్కూల్స్ దేశంలోనే ఎక్కడా లేవు

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి09:
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి విద్యాశాఖ రూ.11,600 కోట్లు మంజూరు చేసిందని.. ఈ మేరకు శనివారం (మార్చి 8) జీవో విడుదల చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇలాంటి స్కూల్స్ ఈ దేశంలో ఎక్కడా లేవని అన్నారు.

2లో..

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదం.. టీబీఎం ఆపరేటర్ మృతదేహం వెలికితీత

కబురు న్యూస్ అమ్రాబాద్ మార్చి09:
నాగర్‌కర్నూల్ జిల్లాలో కూలిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యల్లో కొంత పురోగతి లభించింది. ప్రమాదం జరిగిన 100 మీటర్ల దూరంలో డి-2 పాయింట్‌లో మనుషుల ఆనవాళ్లను కేరళ జాగిలాలు గుర్తించాయి. దీంతో ఆ ప్రాంతంలో సిబ్బంది మట్టిని తొలగించి ఒక మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్‌గా గుర్తించారు. మిగిలిన ఏడుగురి కోసం గాలింపు కొనసాగుతోంది. ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకాల్లో ప్రమాదం చోటుచేసుకుని ఎనిమిది మంది కూరుకుపోయిన విషయం తెలిసిందే. సొరంగంలో కూరుకుపోయిన వారి ఆచూకీ కోసం 15 రోజులుగా వివిధ ఏజెన్సీలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు.





## మహిళా దినోత్సవం రోజు కూడా పచ్చి అబద్ధాలు..

- CM రేవంత్ రెడ్డి పై హరీష్ రావు తీవ్ర విమర్శలు
- మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు ఇచ్చామని రేవంత్ చెప్పిన మాట అవాస్తవం
- "రేవంత్ చెప్పిన వైనం అబద్ధాల పరంపర" - హరీష్ రావు
- మహిళలకు ఇచ్చిన రూ.75 వృద్ధి అన్నది అబద్ధం
- "రేవంత్ అబద్ధానికి ప్యాంట్, షర్ట్ వేసుకుంటే ఆయన" - హరీష్ రావు
- కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేస్తోందని హరీష్ రావు ఆగ్రహం

2లో

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి09:
మహిళ సంఘాలకు రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.. నిజంగా రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఎక్కడ ఇచ్చారో చెప్పాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. మహిళ దినోత్సవం రోజు కూడా సీఎం రేవంత్ రెడ్డి తన అబద్ధాల పరంపర కొనసాగించారని ఎద్దేవా చేశారు. మహిళ సంఘాలకు గత 11 నెలల కాలంలో ఒక్క పైసా వడ్డీ లేని రుణం కూడా విడుదల చేయలేదని అన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్లో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం (మార్చి 9) తెలంగాణ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహిళ దినోత్సవం రోజున పరేడ్ గ్రౌండ్ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి నిజాలు మాట్లాడాలని హితవు పలికారు.



2లో

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయశాంతి.. జాబితా విడుదల చేసిన కాంగ్రెస్

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి09:
తెలంగాణలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. నాలుగు స్థానాల్లో ఒక స్థానాన్ని సీపీఐకి కేటాయించింది. మిగిలిన మూడు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి పేర్లను ఖరారు చేసినట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు.ఎమ్మెల్యేల కోటా నుంచి ఐదు ఎమ్మెల్సీల ఎన్నికకు ఈ నెల 10వ తేదీలోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా మూడు కాంగ్రెస్‌కు, ఒకటి భారాసకు వస్తాయి.



## ఆ అంశంలో మీకు, కేసీఆర్ ప్రభుత్వానికి పోలికా.. సీఎంకు మాజీమంత్రి సబిత కౌంటర్

మహిళల శాపనార్థాలు ముఖ్యమంత్రికి వినపడటం లేదా అని, మహిళల అంశంలో కేసీఆర్ ప్రభుత్వానికి, మీకు నక్కకు నాగాలోకానికి ఉన్నంత తేడా ఉంటుందని మాజీమంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సబితా ఇంద్రారెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. సీఎంకు కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె.. నాడు మిషన్ భగీరథ ద్వారా ఆడబిడ్డల నీటి కష్టాలు తీర్చిన కేసీఆర్ ప్రభుత్వంతో.. నేడు ప్రభుత్వ కార్యాలయాల ముందు మళ్ళీ మొదలైన మహిళల ఖాళీ బిందెల ప్రదర్శనతో మీరు పోటీ పడుతున్నారా? అని ప్రశ్నించారు. అలాగే తులం బంగారం హామీని తుంగలో తొక్కిన మీరు, ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ లాంటి విన్నూత్న పథకాల సృష్టికర్తతో మీ పోటీనా అని ఎద్దేవా చేశారు.

తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# దయ్యాల వేద పఠనం!

తెర వెనుక కత్తుల కోలాటమాడుతున్నవారు తెరముందుకొచ్చి శాంతి కపోతాలను వదులుతున్నారు. రోత చేష్టల రంగమార్తాండులు శ్రీరంగనీతులు బోధిస్తున్నారు. అదిగో దొంగ ఇదిగోదొంగ అంటూ గజదొంగలే అరుస్తున్నారు. ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్‌లో కంచె చేను మేస్తున్నది. పోలీసు వ్యవస్థను ప్రతిపక్షంపైకి పాలకులు ఉసిగొల్పుతున్నారు. ఇదే కదా, అసలు సిసలైన వ్యవస్థీకృత నేరం. అత్యున్నత స్థాయి పోలీసు అధికారి మంత్రి వర్గం ముందు హాజరై ఓ గొప్ప వాగ్దానం చేశాడని వార్తలు వెలువడ్డాయి. ప్రతిపక్షాన్నీ, దాని అభిమానులనూ వేటాడే పనిలో మరింత వేగం పెంచుతారట. దీన్నేమంటాము? నేరమే అధికారమై కొలువు దీరడం కాదా? నేరమే అధికారమై కొరడా ఝుళిపించడం కాదా? నేరమే అధికారమై ప్రజల్నే నేరస్థుల్ని చేస్తుంటే నోరుండీ ఊరక కూర్చున్న ప్రతి ఒక్కడూ నేరస్థుడేనంటారు విప్లవకవి వరవరరావు. ఈరోజు వేటాడుతున్నది ప్రతిపక్షాన్నే కావచ్చు. రక్తం రుచి మరిగిన పులికి పరిమితులూ, షరతులూ వర్తి స్తాయా? ఉపవాస దీక్షలేమైనా అడ్డొస్తాయా? పౌరహక్కులను పాదాల కింద తొక్కేయడానికి అలవాటుపడ్డ పోలీస్ రాజ్యం కూడా అంతే! ఈ రోజున వాడు తడుతున్నది నీ ఇంటి తలుపును కాకపోవచ్చు. నేడు కాకపోతే రేపు లేదా మరునాడు... నువ్వు నీ హక్కుల్ని గురించి ప్రశ్నించిన రోజున నీ ఇంటి ముంగిట కూడా ఆ బూట్ల చప్పుడు వినిపిస్తుంది.నేరమే అధికారమై ప్రశ్నిస్తున్న ప్రతివాడి మీద నేరస్థుడనే ముద్ర వేసే ధోరణిని ఆదిలోనే ప్రతిఘటించకపోతే ప్రజా స్వామ్య మనుగడకే ప్రమాదమేర్పడుతుంది. అధికారంలోకి రావడానికి అసత్యాలకూ, అభూత కల్పనలకూ ఒడిగట్టారు గనుక ప్రభుత్వపక్ష స్వభావాన్ని నేరపూరితమైనదిగా భావించ వలసి వస్తున్నది. అసత్యాలూ, అభూత కల్పనలన్నీ ఒక్కొ క్కటిగా రుజువౌతూ వస్తున్నాయి గనుక నేరమే అధికారం రూపు దాల్చిందని అనుకోవలసి వస్తున్నది. గతకాలపు జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందనీ, 14 లక్షల కోట్ల అప్పు చేశారనీ కూటమి పక్షం ఊరూవాడా ఏకంచేసి ప్రచారం చేసింది. మొన్ననే రాష్ట్ర శాసనసభలో సాక్షాత్తూ ఆర్థికమంత్రి పాత ప్రచారానికి విరుద్ధమైన ప్రకటన చేశారు. జగన్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు 3 లక్షల 39 వేల కోట్లేనని తేల్చారు. ఎంత గుండెలు తీసిన బంట్లు వీరు? ఈ ఒక్క ఉదాహరణ చాలదా, ప్రభుత్వ నేరపూరిత స్వభావాన్ని నిర్ధారణ చేయడానికి? అప్పుల ప్రస్తావన మచ్చుకు మాత్రమే. ఇటువంటి బేషరమ్ ప్రచారాలు చాలా చేసింది కూటమి. సామాన్య ప్రజల ఆశల మీద, ఆకాంక్షల మీద కూటమి జూదమాడింది. వారి కలల అలల మీద ఆటలాడింది. ఏమార్చడానికి ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోను డస్ట్‌బిన్‌లోకి గిరాటేసింది. కుర్చీ మీద కూర్చొని నవమాసాలు గడిచిపోయాయి. హామీల డెలివరీ ఆనవాళ్లే లేవు. ఉండకపోవచ్చు కూడా. బడ్జెట్‌లో కొన్ని హామీలకు మాత్రమే అరకొర కేటాయింపులు చూపారు. మిగతా వాటి ఊసే లేదు. నిరుద్యోగులకు నెలకు 3 వేల భృతి ఇస్తామన్నారు. మోసం చేశారు. ఆడబిడ్డలకు నెలకు పదిహేను వేలిస్తామన్నారు. మోసం చేశారు. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏటా 15 వేలిస్తా మన్నారు. దానికి ఒక ఏడాది ఎగనామం పెట్టి, ఈసారి బడ్జెట్‌లో అవసరమైన సొమ్ములో సగం మాత్రమే కేటాయించారు.ఇంతవరకూ ఒక్క పైసా కూడా లబ్ధిదారులకు చేరలేదు.రైతుకు ఏటా 20 వేల ఆర్థిక సాయమన్నారు. రైతన్న ఎదురు చూస్తూనే ఉన్నాడు.సాయం సంగతి దేవుడెరుగు. పండించిన పంటకు గిట్టు బాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారు. జగన్ హయాంలో ఇరవై నుంచి ఇరవై ఏడు వేల దాకా పలికిన క్వింటాల్ మిర్చి ధర ఇప్పుడు ఆరేడు నుంచి పదివేల దాకా పడిపోయింది.పెట్టుబడి ఖర్చులు కూడా రైతులకు రాలేదు. అన్ని పంటల కథలూ దాదాపు ఇంతే! కాల్వల కింద వేసుకున్న వరి పైర్లు కూడా నీటి తడులు లేక ఎండిపోతున్న వైనాన్ని ఐదేళ్ల తర్వాత ఇప్పుడే చూస్తున్నాము. మహిళలకు ఉచిత బస్సు ఇంకా డిపో దాటి రోడ్డెక్కలేదు. అప్పుడే దానిమీద మాట మార్చడం మొదలైంది. ఉచిత బస్సును ఒక్క జిల్లాకే పరిమితం చేస్తామని ఇప్పుడు చెబుతున్నారు.ఈ రకంగా హామీల ఎగవేతతోపాటు పాలనా వైఫల్యాలతో ఆదిలోనే అప్రతిష్ఠ మూటగట్టుకున్న కూటమి సర్కార్ విమర్శ కుల నోళ్లు మూయించి, అసత్యాలను ప్రచారంలో పెట్టి పబ్బం గడుపుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీపై దాడిని కేంద్రీకరించి, భారత న్యాయసంహితలోని 111వ సెక్షన్‌ను ఈ దాడికి ఆయుధంగా వాడటం మొదలుపెట్టారు. సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేసే వారిపై ఈ సెక్షన్ వాడకూడదని ఏపీ హైకోర్టు చెప్పినా కూడా కూటమి సర్కార్ చెవికెక్కించుకోలేదు. కిడ్నాపులు, దోపిడీలు, భూకబ్జాలు, ఉగ్రవాద కార్యకలాపాలు, ఆర్థిక నేరాలు వగైరా ముఠాలుగా ఏర్పడి చేసే నేరాలు (వ్యవస్థీకృత నేరాలు) ఈ సెక్షన్ పరిధిలోకి వస్తాయి.సోషల్ మీడియాలో చేసే విమర్శలను ఈ పరిధిలోకి తెచ్చి రాష్ట్ర సర్కార్ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ప్రత్యర్థుల పట్ల కక్షపూరిత వైఖరి కారణంగానే సర్కార్ ఈ కుట్రకు తెరతీసిందనుకోవాలి. సోషల్ మీడియాలో చేసే విమర్శల వెనుక ఎవరిదో ప్రోద్బలం ఉన్నదనీ, ఇదంతా వ్యవస్థీకృతంగా జరుతున్నదనీ ఓ స్క్రీన్‌ప్లేను తయారుచేసి, దానికి అనుగుణంగా కీలక వ్యక్తులను అరెస్ట్ చేయాలనీ, తద్వారా ఆ పార్టీని బలహీన పరచాలనే పన్నాగం స్పష్టంగానే కనిపిస్తున్నది. ఇందు కోసం వేలాదిమంది కార్యకర్తలు, అభిమానుల మీద కేసులు పెట్టాలనీ, వేధించాలనీ జిల్లాల వారీగా టార్గెట్లు పెట్టుకున్నట్టు వార్తలు వస్తున్నాయి.ఇటీవల పోలీసు ఉన్నతాధికారి నిర్వహించిన ఒక సమీక్షా సమావేశంలో కూడా ఈ టార్గెట్‌లను చేరుకునేలా సహకరించాలనే ఆదేశాలిచ్చినట్టు వచ్చిన వార్తలు నిజమైతే అంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉండదు. గత ప్రభుత్వ హయాంలో కూటమి అగ్రనాయకులంతా బరితెగించి మాట్లాడిన బూతుల ఆడియోలు, చెప్పులు చూపెట్టిన వీడియోలు కోకొల్లలు. వీరికి భిన్నంగా వైసీపీ అధినేత ఏనాడూ ఏ ఒక్క అసభ్యకర వ్యాఖ్యానం చేయలేదు. అయినా సరే, వీరి బూతులకు బదు లిచ్చిన నేతలపై అక్రమ కేసులకు తెగబడుతున్నారు.మొన్నటి మంత్రివర్గ సమావేశం ఎజెండా ముగిసిన తర్వాత ఒక పోలీస్ ఉన్నతాధికారి హాజరై ఒక వింత సందేశాన్ని వినిపించినట్టు యెల్లో మీడియా టాప్ న్యూస్‌గా ప్రచారంచేసింది. బహుశా కూటమి పెద్దల తాజా కుట్రలో భాగంగానే ఈ వింత కథను ప్రచారంలోకి తెచ్చి ఉంటారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల చనిపోయిన రంగన్న అనే వివేకానందరెడ్డి ఇంటి వాచ్‌మన్ మరణం అనుమానాస్పదమేనని ఆ ఉన్నతాధికారి మంత్రులకు ఉపదేశించారట! అనారోగ్యంతో ఉన్న తన భర్తను పోలీసులు వేధించారనీ, అందువల్లనే అయన చనిపోయాడనీ రంగన్న భార్య మీడియాతో మాట్లాడిన మాట లను వారెందుకు పరిశీలనలోకి తీసుకోలేదో తెలియదు మరి! అంతటితో ఆగలేదు. ఈమధ్యకాలంలో చనిపోయిన వ్యక్తులను వివేకానంద హత్య కేసుకు లింకు చేస్తూ అవన్నీ అనుమానాస్పద మరణాలేనని చెప్పడానికి పూనుకోవడం, మోకాలుకు, బోడిగుండుకు ముడిపెట్టినట్టు కథలు అల్లడం దిగ్భ్రాంతి కలిగిస్తున్నది. అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన అభిషేక్ రెడ్డి మరణంపై కూడా అనుమానాలున్నాయట! జగన్ కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలు చూరగొన్న డ్రైవర్ నారాయణ కేన్సర్ వ్యాధికి చికిత్స తీసుకుంటూ కొంతకాలం క్రితం చనిపోయాడు. అందులో కూడా అనుమానం ఉన్నదట! నీచమైన కుట్రలకు పరాకాష్ట డాక్టర్ గంగిరెడ్డి పేరును కూడా ఇందులోకి లాగడం. డాక్టర్‌గంగిరెడ్డి భారతమ్మ తండ్రి. కరోనా సోకడంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ చనిపోయారు.

# ఆ అంశంలో మీకు, కేసీఆర్ ప్రభుత్వానికి పోలికా..

# సీఎంకు మాజీమంత్రి సబిత కౌంటర్

మొదటిపేజీ తరువాయి

వివాహాలు ఆపి అమ్మాయిల ఉన్నత విద్యకు బాటలు వేసి, దాదాపు అన్ని యూనివర్సిటీలలో బాలికలే అధికంగా ఉండటం నిజం కాదా అని నిలదీశారు.
కేసీఆర్ కిట్, అమ్మవడి, న్యూట్రిషన్ కిట్, జిల్లాకోక సఖి సెంటర్ పెట్టి భరోసా కల్పించి, ఆడపిల్ల పుడితే 13 వేలు ఇచ్చి అండగా నిలిచిన కేసీఆర్ ప్రభుత్వంతో మీ పోటీనా అని అడిగారు. అంతేగాక కేవలం అమ్మాయిల కోసం 690 గురుకుల పాఠశాలలు, 1000 కి పైగా జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్, 80 డిగ్రీ మహిళ కళాశాలలు, ఇందులో కేవలం ఎస్సి, ఎస్టీ బాలికలకు 50 కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలు, పీజీ, న్యాయ కళాశాల పెట్టి అమ్మాయిల చదువులో దేశానికే ఆదర్శంగా కేసీఆర్ నిలిస్తే, ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడటంలో మీరు మొదటి స్థానంలో ఉన్నారా? అని దుయ్యబట్టారు. ఇక స్వయం సహాయక మహిళలు చిరు వ్యాపారాల నుండి పెద్ద స్థాయి సంస్థలు స్థాపించేలా ప్రోత్సాహకాలు ఇచ్చింది నాటి ప్రభుత్వం కాదా అంటూ.. వీ హబ్ ఏర్పాటు చేసి మహిళ పారిశ్రామిక వేత్తలకు పెద్ద ఎత్తున పరిశ్రమలు స్థాపించేలా అనేక రాయితీలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే కదా అని వివరించారు.ఆశా వర్కర్లు, అంగన్ వాడి వర్కర్లు, మెప్మా ఆర్పీలు, వీఓఏలు మధ్యాహ్నం భోజనం కార్మికులకు జీతాలు పెంచిన ఘనత గత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మహిళల భద్రత విషయంలో షీ టీం లు తెచ్చి దేశానికి ఆదర్శంగా నిలిచిన నాటి ప్రభుత్వంతో.. భద్రత ఆటకెక్కి రోజుకొక్క చోట మహిళల పట్ల అఘాయిత్యాలు, హత్యలు ఈ ప్రభుత్వం సాధించిన ప్రగతా అని మండిపడ్డారు. ఉచిత బస్ ప్రయాణం అంటూ ఉదరగొడుతున్న మీరు హైటెక్ సిటీ లాంటి ప్రాంతంలో అమ్మాయిలు, మహిళల కోసం వివిధ కంపెనీల సహకారంతో నాడే ఉచితంగా షీ షటిల్ బస్ లు ప్రారంభించిన విషయం మర్చిపోవొద్దని హితవు పలికారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి రాష్ట్రంలో సగానికి పైగా జడ్పీ చైర్మన్ లను చేసింది బీఆర్ఎస్ పార్టీ కాదా అని, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకు కేటాయించిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ దేనని చెప్పారు.కేవలం మహిళల కోసం యూనివర్సిటీని ఏర్పాటు చేసింది కేసీఆర్ ప్రభుత్వం కాదా అని అడిగారు. పెద్ద ఎత్తున డబుల్ బెడ్ రూమ్ లు నిర్మించి పేద, మధ్యతరగతి ప్రజలకు గూడు కల్పిస్తే, వరుసగా బుల్డోజర్లు పెట్టి కూల్చుతున్న మీకు మహిళలలు పెడుతున్న శాపనార్థాలు వినపడటం లేదా అని, వారంతా మీ గ్రహణం ఎప్పుడు విడుతుందా అని ఎదురుచూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక అదానీ, అంబానీలతో పోటీ మీకు, మీ మంత్రులకా? లేక మహిళలకా? అని విమర్శలు చేశారు. అలాగే మనల్ని మనం కరెక్ట్ అనుకోవడంలో ఏమాత్రం తప్పులేదు కానీ, మన స్వార్థం, ద్వేషం, ఈర్ష్య, చేతకాని తనం కోసం ఎదుటి వాళ్ళని తప్పుగా చిత్రించకూడదు అని, ప్రజలు అన్నీ గమనిస్తుంటారు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాసుకొచ్చారు.

# మహిళా దినోత్సవం రోజు కూడా పచ్చి అబద్ధాలు..

మొదటిపేజీ తరువాయి

మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాం అనేది అవాస్తవమని.. నిన్నటి సభలో సీఎం రేవంత్ రెడ్డి మాటలు వినలేక మహిళలు వెళ్లిపోతుంటే పోలీసులు అడ్డుకున్నారని ఎద్దేవా చేశారు. గతంలో మా ప్రభుత్వం యూనిఫాం కుట్టేందుకు మహిళ సంఘాలకు రూ.50 చొప్పున ఇచ్చాం.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా అవే రూ.50 ఇచ్చారని మహిళలు చెబుతున్నారు. కానీ రూ.75 ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధానికి ప్యాంట్, షర్ట్ వేస్తే సీఎం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఇలాంటి స్కూల్స్ దేశంలోనే ఎక్కడా లేవు

మొదటిపేజీ తరువాయి

20-25 ఎకరాల్లో అన్ని వసతులతో టీచింగ్ స్టాఫ్స్?కి కూడా అక్కడే వసతి ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో ఇంటిగ్రేటేడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని చెప్పారు.ఇంటిగ్రేటేడ్ స్కూళ్లలో డిజిటల్ పాఠాలు ఉండేలా డిజైన్ చేశామని.. ప్రైవేట్ లో చదివించలేని పిల్లలకు కార్పొరేట్ స్థాయి వసతులతో విద్య అందిస్తామన్నారు. రాష్ట్ర విద్యారంగంలో ఇది విప్లవాత్మక నిర్ణయమని అభివర్ణించారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ప్రజల జీవన స్థితిగతులు మార్చడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పరిపాలన అంటే ఎలా ఉంటుందన్న దానికి నిదర్శనమే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. గురుకులాలను కోళ్ల ఫారాలు, పశువుల షెడ్ లో నిర్వహించారని ఫైర్ అయ్యారు. కానీ మేం అధికారంలోకి వచ్చాక పేద పిల్లలకు మంచి విద్యను అందివాలని కార్పొరేట్ స్థాయి వసతులతో ఇంటిగ్రేటేడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. ఆనాటి ప్రభుత్వం రూ.7.19 లక్షల కోట్ల అప్పు, దానికి మిత్తి మీద పడుతున్నా.. అవి చెల్లిస్తూనే.. పథకాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత గురుకులాల్లో పిల్లల ఇబ్బందులకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచాలన్న ఆలోచన ఎందుకు చెయ్యలేదని ప్రశ్నించారు. ఏ కార్యక్రమం చేసినా ప్రజలకు లబ్ధి జరగాలనేదే మా ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయశాంతి.. జాబితా విడుదల చేసిన కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

ఐదో స్థానం కోసం ఎంఐఎంతోపాటు మరికొన్ని ఓట్లు అవసరమవుతాయి. భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు ఓట్లు వేస్తే కాంగ్రెస్‌కు నాలుగో సీటు లభించే అవకాశమున్నా, సుప్రీంకోర్టులో కేసు నేపథ్యంలో ఈ ఎమ్మెల్యేలు ఎలాంటి వైఖరి తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమకు ఎమ్మెల్సీ స్థానం ఇవ్వాలని సీపీఐ కోరింది. సీపీఐ అగ్ర నాయకత్వం కూడా కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మాట్లాడారు. దీంతో ఆ పార్టీకి ఒక స్థానం కేటాయించారు. అభ్యర్థి ఎంపికపై ఇప్పటికే సీపీఐ రాష్ట్ర కార్యవర్గం చర్చిస్తోంది. ఆ పార్టీ తరఫున ఎమ్మెల్సీ ఆశావహుల్లో నెల్లికంటి సత్యం యాదవ్, చాడ వెంకటరెడ్డి ఉన్నారు. ఇవాళ రాత్రిలోపు సీపీఐ అభ్యర్థిని ప్రకటించే అవకాశముంది.

# భారాస ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్



తెలంగాణలో ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు భారాస తన అభ్యర్థిని ఖరారు చేసింది. భారాస ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ పేరును ప్రకటించింది. మొత్తం ఐదు స్థానాలకు ఎన్నికలు జరగనుండగా.. మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్.. ఒక స్థానాన్ని తన మిత్రపక్షం సీపీఐకి కేటాయించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి పేర్లు ఖరారు కాగా.. భారాస నుంచి దాసోసు శ్రవణ్ పేరును కేసీఆర్ ఖరారు చేశారు.

# ప్రణయ్ అమృత కేసులో రేపే తుది తీర్పు



రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో రెండో అదనపు సెషన్స్ కోర్టు,ఎస్సీ ఎస్టీ కోర్టు సోమవారం (మార్చి 10న) తుది తీర్పును వెలవరించనుంది. దీంతో ఈ కేసులో నిందితుల పాత్రపై సాక్ష్యాధారాలను పరిగణించి శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం వెల్లడించే తుదితీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఇక కేసు విషయానికొస్తే.. తన కుమార్తె అమృత కులాంతర వివాహం చేసుసుకుందన్న నెపంతో తండ్రి మారుతీరావు సుపారీ గ్యాంగ్‌తో 2018 సెప్టెంబరు 14వ తేదీన ప్రణయ్‌ను హత్యచేయించాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసుశాఖ అన్ని కోణాల్లో విచారణ పూర్తిచేసి 1600పేజీల్లో చార్జిషీట్ నివేదికను రూపొందించింది. 2019 జూన్ 12న చార్జిషీట్ దాఖలు చేయగా ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్‌కోర్టు విచారణ మొదలుపెట్టింది.సుమారు ఐదున్నర ఏళ్ల పాటు విచారణ కొనసాగగా, ఈ కేసులో ఇప్పటికే ఏ-1 మారుతీరావు 2020 మార్చి 7న ఖైరతాబాద్ వైశ్య భవన్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. మరో ఏడుగురు నిందితుల పాత్రపై సైంటిఫిక్ ఎవిడెన్స్, పోస్టుమార్టం నివేదిక, చార్జ్ షీట్‌తో పాటు సాక్షులను విచారించిన న్యాయస్థానం విచారించి తుది తీర్పును మార్చి 10వ తేదీకి రిజర్వు చేసింది. రేపు తుది తీర్పును వెలువరించనుంది.ఈ కేసులో ఏ-2 సుబాష్ శర్మ, ఏ-3 అజ్గర్ అలీ, ఏ-4 అబ్దుల్ బారీ, ఏ-5 ఎంఏ కరీం, ఏ-6 తిరునగరు శ్రవణ్ కుమార్, ఏ-7 శివ, ఏ-8 నిజాంలుగా నిర్ధారించారు. సుబాష్ శర్మ, అస్గర్ అలీ మినహా మిగతా ఐదుగురు నిందితులు గతంలోనే బెయిల్ పొందారు. నిందితుల్లో అస్గర్ అలీ గతంలో గుజరాత్ మాజీ హెూంమంత్రి హరేన్ పాండ్యా హత్యతో పాటు పలు ఉగ్ర కుట్రల్లో కీలక నిందితుడు.

# మావోలకు లొంగుబాటే శరణ్యమా?

భద్రతా బలగాల భారీ వేట.. వృద్ధాప్యానికి చేరిన మావోయిస్టు అగ్ర నాయకులు.. తరుముకొస్తున్న ఆపరేషన్ కగార్ డెడ్‌లైన్... వెరసి అన్నల్లో అంతర్మథనం మొదలైందనే చర్చ జరుగుతోంది. దశాబ్దాల ఉద్యమ చరిత్ర కలిగిన మావోయిస్టులకు గత మూడేళ్లుగా కోలుకోలేని ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఒక్కో ఎన్‌కౌంటర్‌లో పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో పూర్తి పట్టున్న ప్రాంతాలు సైతం సాయుధ పోలీసు బలగాల చేతిలోకి వెళ్లిపోతున్నాయి. దీంతో కొందరు మావోయిస్టులు లొంగుబాట పట్టారు. గత నెలన్నరరోజుల్లో తెలంగాణ పోలీసుల ఎదుట కొందరు కీలక నాయకులు లొంగిపోయిన విషయం తెలిసిందే.ఇటీవల మావోయిస్టు పార్టీ డీవీసీఎం పుల్సం పద్మ అలియాస్ ఊరే అలియాస్ గంగక్క ములుగు ఎస్పీ శబరీష్ ఎదుట లొంగిపోయారు. ఈమె దివంగత మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ భార్య. పద్మ 27 ఏళ్ల తన అజ్ఞాత జీవితాన్ని విడిచి 52 ఏళ్ల వయసులో జనజీవన స్రవంతిలో కలిశారు. అలాగే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ వంజెం కేషా అలియాస్ జిన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఎదుట లొంగిపోయింది. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాలకు కొందరు ఆకర్షితులవుతున్నారు.మరోవైపు మావోయిస్టు పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత రావడం, ఆరోగ్యం కూడా సహకరించకపోవడంతో కేషా లొంగిపోయిందని...ఆమె లొంగుబాటు సందర్భంగా అంబర్ కిశోర్ ఝా వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు కేషాతోపాటు ఇటీవల కొందరు మావోయిస్టుల లొంగుబాట్ల వెనుకున్న పరిస్థితికి అద్దం పడుతున్నాయని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇలా పలు కీలక స్థానాల్లో పనిచేసిన మావోయిస్టు సీనియర్ నాయకులు వరుస లొంగుబాట్లపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

### తెలంగాణలో గతేడాది 41 మంది సరెండర్

2024లో తెలంగాణ పోలీసుల ఎదుట 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఒకరు స్పెషల్ జోనల్ కమిటీ, ఒకరు స్టేట్ కమిటీ సభ్యుడు, 16 మంది ఏరియా కమిటీ సభ్యులు, మిగిలినవారు పలు కేడర్లకు చెందినవారు. 85 మంది మావోయిస్టులను తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు.

### నాయకుల వయో'భారం'

మావోయిస్టు పార్టీకి గుండెకాయ వంటి సెంట్రల్ కమిటీ సభ్యుల్లో దాదాపు అంతా ఐదు పదుల వయసు దాటినవారే ఉన్నారు. మావోయిస్టులను ముందుండి నడిపించాల్సిన అగ్రనాయకత్వం వయోభారంతోపాటు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్టు సమాచారం. పైగా తెలంగాణ రాష్ట్ర కమిటీలోనూ స్థానికులకంటే ఇతర రాష్ట్రాలవారే ఎక్కువగా ఉన్నారు. వీరిలోనూ కీలక నేతలు కూడా వయసులో పెద్దవారే. వీరంతా ప్రస్తుతం సాయుధ పోలీసు బలగాల నుంచి ఎదురవుతున్న ప్రతిఘటనను సమర్థంగా ఎదుర్కోలేని పరిస్థితి. ఇలా ప్రతి అంశంలోనూ మావోయిస్టులకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో కిందిస్థాయి నాయకత్వానికి భరోసా ఇచ్చి నడిపించేవారు లేకుండాపోయారు.

# రాయల రవన్న ఆశయాలను సాధిద్దాం

**– సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ...**




**కబురు న్యూస్,నిజామాబాద్ మార్చి 09 :** రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) ఆశయాలను సాధిద్దామని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కోటగల్లీలోని ఎన్ఆర్ భవన్ లో రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ, భారత విప్లవోద్యమంలో 50 సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపి, అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిన ఘనత కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)కు ఉందన్నారు. కామ్రేడ్ రవన్న సుదీర్ఘకాలం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాడన్నారు. గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో లక్షలాది ఎకరాల పోడు భూములను గిరిజనులు, నిరుపేద గిరిజనేతరకు సాధించడంలో రవన్న పాత్ర క్రియాశీలకమైందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించడంలో కామ్రేడ్ రవన్న మార్గదర్శకత్వం అపూర్వమైందన్నారు. రష్యా తరహా పెట్టుబడిదారీ దేశంగా మన దేశముందని, భారతదేశంలో విప్లవం విజయవంతం కావాలంటే ఈ మారిన పరిస్థితి అనుగుణంగా పార్టీ కార్యక్రమం, పంథా, నిబంధనావలిని మార్చుకోవాలని సిద్ధాంతికరించిన నాయకుడన్నారు. భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని ఆశించారని, తద్వారానే విప్లవం విజయవంతం అవుతుందని కామ్రేడ్ రవన్న సిద్ధాంతికరించారన్నారు. నేడు దేశంలో మనవాద, మతోన్మాద ఫాసిజం అత్యంత ప్రమాదంగా మారిన నేపథ్యంలో శ్రామిక, కష్టజీవుల సమైక్య, బలమైన ఉద్యమ నిర్మాణాలు అత్యంత ఆవశ్యకమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ఎం.నరేందర్, డి. రాజేశ్వర్, డి.కిషన్, ఆల్గొట్ రవీందర్, జిల్లా కార్మిక నాయకులు బండారి లక్ష్మణ్,జి.శివకుమార్,కిరణ్ కుమార్,చరణ్,ఎస్.శివకుమార్,మాధవి, రవి కిరణ్, సిఎల్పి జిల్లా నాయకులు స్వామి, పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ అర్వింద్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు

**- జిల్లాకు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలి...**
**- నుడా చైర్మన్ కేశ వేణు...**




**కబురు న్యూస్,నిజామాబాద్ మార్చి 09 :** నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని నుడా చైర్మన్,కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు అన్నారు. జిల్లా కాంగ్రెస్ భవన్ లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు ఎంపీ అర్వింద్ ఎన్ని నిధులు,ఎన్ని రైల్వే పనులు తీసుకొచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. అర్వింద్ ఎంపీగా గెలవడమే మిరాకిల్ అని ఎద్దేవా చేశారు. మోడీ హవాలో గెలిచిన ఆయనకు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై విమర్శలు చేసే అర్హత లేదన్నారు. గుత్ప, అలీసాగర్,తెలంగాణ యూనివర్సిటీ,మెడికల్ కళాశాల వంటి ఎన్నో పనులు సుదర్శన్ రెడ్డి చేశారని గుర్తు చేశారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమన్నారు.బైంసా అల్లర్లు ఇక్కడ చూపించి గత ఎన్నికల్లో బీజేపీ 28 సీట్లు గెలిచిందని విమర్శించారు. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని బీఆర్ఎస్,బీజేపీ నాశనం చేశాయని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ విమర్శించారు. ఫ్యాక్టరీని తెరిపిస్తామని మభ్య పెట్టారన్నారు. గతంలో తమ ప్రభుత్వం తాగు సాగునీటి రంగాల కోసం విశేష కృషి చేసిందన్నారు. నందిపేటలో సెజ్ కోసం 400 ఎకరాల భూమి ఇచ్చిందన్నారు. అర్వింద్ ఒక్క ఇండస్ట్రీనైనా తీసుకొచ్చావా..? యువతకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చావా..? అని ప్రశ్నించారు. అహంకారపూరిత వ్యాఖ్యలు సరికావని ఆయన హితవు పలికారు.నియోజకవర్గానికి ఒక్క నాలుగు లేన్ల రోడ్డునైనా తీసుకొచ్చావా అని అన్నారు. అర్వింద్ మాటలు ఆడవాళ్లు నీటి కోసం గొడవపడినట్లు ఉన్నాయని ఎద్దేవా చేశారు.ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి, ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భట్టు వేణురాజ్ తదితరులున్నారు.

# మోస్ర భారతీయ విద్యా నికేతన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**కబురు న్యూస్,మోస్రా,మార్చ్ 09 :** చిన్ననాడు ఆడిపాడుతూ చదువుకున్న చిన్నప్పటి స్మృతులను గుర్తుచేసుకుంటూ చదువులమ్మ ఒడిలో సందడి చేశారు.మోస్రా భారతీయ విద్యానికేతన్ హై స్కూల్ 1996-97 బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని అపూర్వంగా జరుపుకున్నారు. చదువులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. శాలువా,పూల దండలు వేసి, మెమెంటో అందజేసి గురువులు,రంగారావు అనసూయ,శివసచరణ్, హరిచర్సన్,వెంకటేష్,సంజీవ్,గోపాల్,నాగభూషణం,సాయిలు,విజేందర్,సరూప,పాదాలకు నమస్కరించారు.ఉదయం నుంచి DRR ఫంక్షనల్ లో ఎంతో ఉల్లాసంగా గడిపారు.ఎవరు ఎక్కడ, ఏ రంగంలో స్థిరపడ్డారో సమ్మేళనంలో పరిచయం చేసుకున్నారు.ఆనాటి తీపి గుర్తులను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడుపుతారు.పాఠశాల ద్వారా తాము ఇంత మంది కలవడం సంతోషం గా ఉంది అని అన్నారు.అందరు కలిసి భోజనాలు చేశారు.ఎంతో మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిన భారతీయ విద్యా నికేతన్ హై స్కూల్ రుణం తీర్చుకోలేనిదని విద్యార్థులు అన్నారు.గురువులకు ఎప్పటికీ రుణపడి వుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు 1996-1997 బ్యాచ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ కాలేజీ విద్యార్థిపై హాస్టల్ వార్డెన్ దాడి

**- పోలిస్ స్టేషన్ లో తల్లిదండ్రుల ఫిర్యాదు...**






**కబురు న్యూస్,నిజామాబాద్, మార్చి 09 :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ కాలేజీలో హాస్టల్ విద్యార్థిపై వార్డెన్ దాడి చేశాడు. ఈ సంఘటన అదివారం సాయంత్రం జరిగింది.నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వాహజుద్దిన్ (17) ఇంటర్మడియట్ ద్వితియ సంవత్సరం చధువుతున్నాడు.పరీక్షల నేపథ్యంలో వాహజుద్దిన్ హాస్టల్ లో ఉండి చదువుతున్నాడు.చదువకుండా నిద్ర పోతున్నాడని అదివారం హాస్టల్ ఫ్లోర్ ఇంచార్జ్జిపై నిఖిల్ అనే వార్డెన్ కొట్టడంతో గాయాలయ్యాయి.తాను రంజాన్ మాసం సంధర్భంగా ఉపవాసం ఉంటూ చదువుతుండగా తనను అకారణంగా కొట్టడాని వాహజుద్దిన్ తల్లిధండ్రులకు పోన్ లో ఫిర్యాదు చేశారు.కుటుంబ సభ్యులు హాస్టల్ కు వచ్చి ప్రిన్సిపాల్ తో పాటు వార్డెన్ లను నిలదీశారు.అప్పటికే వార్డెన్ ను అక్కడినుంచి పంపించేశారు. అయితే కుటుంబ సభ్యులు నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో వార్డెన్ పై ఫిర్యాదు చేశారు.ఈ విషయంపై స్థానికంగా ఉన్న ప్రిన్సిపాల్ హన్మంత్ రావు ను వివరణ కోరగా హస్టల్ లో ఎలాంటి ఘటన జరుగలేదని చెప్పడం విశేషం.

# నేడు హైదరాబాదులో జరిగే మిలియన్ మార్చ్ డే ను విజయవంతం చేయండి

**– టి. యు. జె. ఎ సి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గాజుల శ్రీనివాస్ గౌడ్**



**కబురు న్యూస్, ధర్మారం మార్చి 09:** నేడు హైదరాబాద్ లో జరిగే మిలియన్ మార్చ్ డే ను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో ఆదివారం రోజున ఇందుకు సంబంధించిన పోస్టర్ ను అవిష్కరించారు. అనంతరం టి యు జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గాజుల శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు ప్రతినెల 30 వేల గౌరవ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్వతంత్ర సమరయోధుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. నేడు జరగనున్న హైదరాబాద్ మిలియన్ మార్చ్ డే ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యొక్క మిలియన్ మార్చ్ ట్యాంక్ బండ్ నుండి అమరవీరుల స్తూపం వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని వారు అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల జయంట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి ఆదేశాల మేరకు ఈయొక్క కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఉద్యమకారులంతా ఏకమై మిలియన్ మార్చ్ డే ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ యొక్క పోస్టర్ ఆవిష్కరణలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భోగే పద్మ,లక్కం కరుణ,పొన్నం ప్రేమలత,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఈదుల శ్రీనివాస్, ఎండపల్లి మండల ప్రధానకార్యదర్శి తరాల విజయ పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలి...




**కబురు న్యూస్,బోధన్ మార్చి 09..** సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ బోధన్ ఏసీపీ శ్రీనివాస్ కు జిల్లా తెలుగు యువత నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్, సిఐ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులను ప్రజలకు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాక బోధన్ డివిజన్లో గల పోలీస్ స్టేషన్లలో సమాచార హక్కు చట్టం బోర్డులు ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, బోధన్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ ల యొక్క పరిధి బోర్డులను, ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. రహదారులపై ప్రమాదాలు జరిగిన సమయంలో ఏ పోలీస్ స్టేషన్ కి ఫిర్యాదు చేయాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బోధన్ డివిజన్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో పనిచేయని సీసీ కెమెరాలను మరమత్తులు చేయించి, భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించకుండా బైపాస్ మీదుగా వెళ్లేలా చూడాలని కోరారు.

# తిమ్మాపూర్ వెంకన్న ఆలయాన్ని దర్శించుకున్న పార్టీ ఇంచార్జ్ ఏనుగు



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 09** బీర్కూరు మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో గల తెలంగాణ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఆలయాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి నియోజకవర్గ నాయకులు కార్యకర్తలతో కలిసి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడిపంటలతో సంతోషంగా ఉండాలని వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యలమంచిలి శ్రీనివాసరావు, మాజీ జడ్పిటిసి ద్రోణవల్లి సతీష్, డిసిసిబి డైరెక్టర్ కమలాకర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్,నాయకులు మంత్రి గణేష్, నందు పటేల్, వెంకట్ రెడ్డి, బండి సాయిలు యాదవ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారీ కాన్వాయ్ తో తిమ్మాపూర్ తరలి వెళ్లిన పార్టీ ఇన్చార్జి ఏనుగు



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 09** బాన్సువాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం నుండి ఆదివారం పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి నియోజకవర్గ నాయకులతో కలిసి బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్ శివారులో గల తెలంగాణ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఆలయానికి భారీ కాన్వాయ్ తో బయలుదేరి వెళ్లారు.

# ఆర్టీసీ బస్టాండ్ వద్ద గంజాయి పట్టివేత



**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,మార్చి 09 :** జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఓ వ్యక్తి వద్ద పోలీసులు గంజాయి పట్టుకున్నారు. 1వ టౌన్ ఇన్స్పెక్టర్ బి.రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కాపు కాసి అనుమానాస్పదంగా తిరుగుతున్న బీస ప్రవీణ్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా 250?గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది.నిందితుడు నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎలవాత్ గ్రామానికి చెందిన వాడని పోలీసులు తెలిపారు.ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.గంజాయి పట్టివేతలో కీలకపాత్ర పోషించిన ఎస్సై మొగులయ్య,సిబ్బంది ని అధికారులు అభినందించారు.

# డాక్టరేట్ అందుకున్న దళితరత్న కాసాల అంబదాస్ కు ఆర్టీసీ ఉద్యోగస్తులు ఘనంగా సన్మానం

**డాక్టరేట్ అందుకున్న నాకు ఆర్టీసీ సహా ఉద్యోగులు నన్ను సన్మానించడం నాకు ఆనందంగా ఉంది దళిత రత్న డా. కాసాల అంబదాస్**





సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మాదారం గ్రామానికి చెందిన దళిత రత్న కాసాలఅంబదాస్ విద్యార్థి దశ నుండి నేటి వరకు యువజన సామాజిక కార్యక్రమాలతో భారత రాజ్యాంగంలోని హక్కులు ప్రతి పౌరుడికి అందే విధంగా అంబేద్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా సామాజిక న్యాయపరమైన పోరాటాలు చేస్తు సేవలను అందిస్తున్న నా సేవలను గుర్తించి హైదరాబాద్ లోని ఆసియా వేదిక ఇంటర్నేషనల్ కల్చర్ రిసర్చ్ స్ఫూర్తి అకాడమీ వ్యవస్థాపకులు చైర్మన్ ఆసియా వేదిక అంతర్జాతీయ కల్చర్ రీసర్చ్ యూనివర్సిటీ కో - ఆర్డినేటర్ లైన్ డా,,ఆకుల రమేష్ మేధావుల చేతుల మీదుగా డాక్టరేట్ అవార్డును అందుకున్న నాకు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, మైనారిటీ నాయకులు, యువజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ,డాక్టర్ అంబదాస్ కు ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉద్యోగస్తులు నాకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించడం నాకు ఆనందంగా ఉందని తెలియజేస్తూ పత్రికా ముఖంగా మాట్లాడుతూ ఈ అవార్డుతో పాటు డా. అంబదాసుగా సామాజిక సమానత్వలను రూపుమాపి సామాజిక ఉద్యమానికి పురుడు పోస్తూ సామాజిక న్యాయం కోసం, నవ సమాజ నిర్మాణం కోసం, పేదలకు రావలసిన హక్కుల కోసం అలుపెరగకుండా కార్యక్రమాలు తీసుకుని ఉన్నత అధికారులకు చేరవేర్చి ఆ సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ముందు ముందు కూడా వారు ఈ సేవలను కొనసాగిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో: డిప్యూటీ సూపరిండెంట్ (టీ) మహమ్మద్ ఇషాక్,రవీందర్, ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు: దాసరి లక్ష్మయ్య, టి జి ఎస్ ఆర్ టి సి యసి/ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జోనల్ ముఖ్య సలహాదారు: యస్.బసప్ప, అసోసియేషన్ నాయకులు: బి.నాగేశ్వర్, సిహెచ్.ఎన్.రావు, అర్జున్,మహేష్ గౌడ్, మైనారిటీ బిహెచ్ఈఎల్ డిపో అధ్యక్షులు: జాంగిర్,వీరస్వామి, మరియు వివిధ సంఘాల నాయలులు పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక కు కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు

**- నామినేట్ ఎమ్మెల్సీ పదవి కోసం ఆశావాహులు ఎదురుచూపు**

కబురు న్యూస్, హైదరాబాద్ మార్చి 09,



తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థు లపై కసరత్తు పూర్తయింది నేడు ఎమ్మెల్సీ అభ్యర్థుల ను కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేయనుంది, కాగా చివరి నిమిషంలో తెలంగాణ నేతల ఢిల్లీ పర్యటన రద్దయింది.కేసి వేణుగోపాల్ ఢిల్లీలో లేకపోవడంతో పర్యటన రద్దు అయింది ఇవాళ రాష్ట్ర అగ్ర నేతలతో ఫోన్లో కేసీ వేణుగోపాల్, మాట్లాడారు.ఎమ్మెల్సీ స్థానాల కోసం కాంగ్రెస్ లో భారీ పోటీ పెరిగింది, తమకే అవకాశం కల్పించాలంటూ ఆశవాహులు కోరుతున్నా రు.నేడు అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ హై కమాండ్ ప్రకటించే అవకాశం ఉంది..కాగా ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయంలో ఉత్కంఠ నెలకొంది ఎమ్మెల్సీ ఓసి కేటగిరి నుంచి వేం నరేందర్ రెడ్డి, పారిజాత నరసింహా రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, కుమార్ రావు, కుసుమకుమార్, పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.

# బ్రిడ్జి నిర్మాణం కోసం భూమి పూజ చేసిన ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్

కబురు న్యూస్, వేములవాడ మర్చి 9





వేములవాడ పట్టణంలో దశాబ్ద కాలంగా మిగిలి పోయిన పట్టణంలోని తిప్పాపూర్ రెండవ బ్రిడ్జి నిర్మాణం కోసం 6 కోట్ల 85 లక్షల వ్యయంతో శంకు స్థాపన చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, పాల్గొన్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు.ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ కామెంట్స్: 2015 సంలో ఆనాటి ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం కోసం భూమి పూజ చేసారు. కానీ పదేళ్లు నిండిన నాయకుల నిర్లక్ష్యంతో పడావ్ గా ఉండి పోయింది. గత బి ఆర్ ఎస్ సర్కార్ నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి అనాడు ప్రతి పక్షహోదాలో నిలదీసి, నేడు భూమి పూజ చేసుకున్నాం మోత్కూరావుపేట - చందుర్తి, కలికోట సూరమ్మ ప్రాజెక్ట్, మల్రిపల్లి ప్రాజెక్ట్, వేములవాడ బ్రిడ్జి నిర్మాణలను పున ప్రారంభం చేశాము. వచ్చే వర్షాకాలంలో లోపు బ్రిడ్జి పూర్తి చేస్తాం. 47 కోట్లతో రోడ్ వైడింగ్ పూర్తి చేస్తాం నష్టపోయే వారికి నష్ట పరిహారం ఇచ్చి మెప్పించి వైడనింగ్ చేస్తాం. ఏ టీ సి మేడిపల్లి లో జూనియర్ కళాశాల మంజూరి చేయడం జరిగింది.ఎన్నికల కోడ్ వల్ల కొంత ఆలస్యం అయ్యింది.
రాజన్న ఆలయానికి 75 కోట్లతో విస్తరణ చేపడు తున్నాం. వేములవాడ లో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణం చేపట్టి ఇండ్లులేని వారికి అంద జేస్తాం. వేములవాడ పట్టణంలో ప్రతీవార్డుకు 10 లక్షల వెచ్చించి మౌలిక వసతుల కల్పిస్తాం.

# మెదక్ జిల్లాలో అంతుచిక్కని వ్యాధితో 10వేల కోళ్లు మృతి



**- తీవ్రంగా నష్టపోయిన పౌల్ట్రీ ఫామ్ యజమానులు**
**- ప్రభుత్వమే ఆదుకోవాలని కోరిన పౌల్ట్రీ యాజమాన్యం**

కబురు న్యూస్,మెదక్ జిల్లా మార్చి 09,

మెదక్ జిల్లా చిన్నశంక రంపేట మండలంలోని గ్రామాల్లో శనివారం సాయంత్రం 10 వేల కోళ్లు అంతుచిక్కని వ్యాధితో మృతి చెందాయి. శివంపేట్ మండలంలోని,గవ్వపల్లి, జంగరాయి గ్రామాల్లోని కోళ్ల ఫాంలలో కళ్ల ఎదుటే వ్యాధికి గురైన కోళ్లు మృతి చెందడంతో ఫాంల యజమానులు కన్నీటి పర్యంతమయ్యారు. వైరస్ సోకడంతో వారం రోజుల నుంచి భారీ సంఖ్యలో కోళు మృతి చెందుతున్నాయని వాటి పోషణదారులు పలువురు వాపోయారు.కాగా మృతి చెందిన కోళ్లను భూమిలో పూడ్చేశారు. రూ.లక్షల్లో నష్టం వాటిల్లిం దని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

# బౌద్ధ క్షేత్రాల పైన జరుగుతున్న దాడులను ఖండిస్తూ, ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నిరసన

**- బౌద్ధ క్షేత్రాలపై బుద్ధిస్తులపై అంబేద్కర్ ఇస్తుల పైన దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకో**
**- దాసరి లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షులు, ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు**




కబురు న్యూస్,సంగారెడ్డి జిల్లా మార్చి 09:

ప్రపంచవ్యాప్తంగా గౌతమ బుద్ధుని బోధనతో శాంతి సమానత్వాన్ని నెలకొల్పే బౌద్ధ ఆలయాల పైన బుద్ధిస్తులపైన అంబేద్కర్ దృష్టిలో పైన దళితుల పైన జరుగుతున్న దాడులను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ రాష్ట్ర అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య మాజీ జనరల్ సెక్రెటరీ వెంకటస్వామి పిలుపుమేరకు హైదరాబాద్ లోని లోయర్ ట్యాంక్ బండ్ లోని డా.బి. ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూల అలంకరణ చేసి, భారత రాజ్యాంగం వర్ధిల్లాలి,బౌద్ధఆలయాలుపరిరక్షించబడాలి, బౌదులపై దాడులను ఆపడంకోసంకేంద్రరాష్ట్రప్రభుత్వాలకు సంఘండిమాండ్ద్వారాతెలియజేసే విధంగానిరసనకార్యక్రమంనిర్వహించడం జరిగింది.దాసరి లక్ష్మయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ సంస్థ యునెస్కో గుర్తించి న ప్రశాంత ప్రదేశమని సర్టిఫై చేసిన బుద్ధగయలో మహాబోధి విహార్ మహాబోధి ట్రస్టులో బ్రాహ్మణులు చొరబడి అక్కడి ప్రశాంతతను భగ్నం చేస్తూ, భిక్షువులపై దాడి చేస్తున్న మత చాందస్తావాదులను తరిమి అక్కడి ప్రశాంతతను,భిక్షువులనురక్షించాలనినేడునిరసనకార్యక్రమంనిర్వహించడం జరిగింది ఉన్నారు.భవిష్యత్తులో కేంద్రరాష్ట్రప్రభుత్వాలుస్పందించకపోతే బౌద్ధ క్షేత్రాలను పరిరక్షించకుంటే బౌదులపై దాడులు, అంబేద్కర్ స్తులపై దాడులు నియంత్రించకుంటే జాతీయస్థాయిలో దళిత సంఘాల ఐక్యం చేసి ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ ద్వారా పెద్ద ఎత్తున సామాజిక ఉద్యమానికి ప్రణాళిక సంసిద్ధం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కోశాధికారి గడ్డం మద్దిలేటి, మాల విద్యావంతుల వేదిక అధ్యక్షులు డా.నిమ్మ బాబురావు, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కడారం వినయ్ కుమార్, పంజాగుట్ట స్టాచు కమిటీఅధ్యక్షులుభానుప్రకాష్, అంబేద్కర్ వాదులుతదితరులుపాల్గొన్నారు

# వైభవంగా అనాధ అమ్మాయి పెళ్లి..

**- పెళ్లి పెద్దగా జిల్లా కలెక్టర్..**
**- ఆత్మ బంధువుగా ఎమ్మెల్యే కవ్వంపల్లి..**
**- బంధువులుగా అధికార గణం..**

కబురు న్యూస్, శంకరపట్నం మార్చి 9







ఓ అనాథ అమ్మాయికి జిల్లా ప్రభుత్వ యంత్రాంగమే బంధువులయ్యారు. కరీంనగర్ లోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన అనాధ అమ్మాయి మౌనిక- సాయి తేజల పెళ్లికి మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కమ్మంపల్లి సత్యనారాయణ ఆత్మబంధువుగా, అధికారులే బంధువులుగా మారి అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. తనకు ఎవరూ లేరనే ఆలోచన రాకుండా... నీ కోసం మేమంతా ఉన్నామంటూ,తన వెంట నిలిచి ఆ అమ్మాయి ముఖంలో సంతోషం నింపారు.అమ్మానాన్నలు కన్యాదానం చేయాల్సిన ఈ పెళ్లికి సాక్షాత్తు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పెళ్లి పెద్దగా వ్యవహరిస్తూ ఆ తంతు నిర్వహించారు. అంతేకాకుండా మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సొంత ఖర్చులతో పెళ్లి భోజనాలు సమకూర్చారు. అంతేకాకుండా పెళ్లికి హాజరై నూతన వధూవరులను నిండు మనసుతో ఆశీర్వదించారు. అలాగే నూతన వస్త్రాలు సమర్పించారు. అలాగే ఎంతోమంది అధికారులు ప్రజా ప్రతినిధులు తమ సొంత ఇంట్లో జరిగిన పెళ్లిగా భావిస్తూ ఆశీస్సులతోపాటు కానుకలు సమర్పించుకున్నారు.ఈ పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తదితరులు ఉన్నారు.

# చైతన్య స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువుల పంపిణీ

కబురు న్యూస్,రామగిరి మార్చి 09

**- యువకులు సేవ వైపు మొగ్గుచూపడం గొప్ప విషయం - మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి**



ఈరోజు అర్జీ త్రీ ఏరియాలోని ఓసిపి టు లో డ్రిల్ ఆపరేటర్ గా పనిచేస్తున్న బొడ్డు వినయ్ కుమార్ గారి సతీమణి ప్రణతి జన్మదినన్ని పురస్కరించుకొని కల్వచర్ల గ్రామం గణేష్ నగర్ లో నివాసం ఉంటున్న ఒక నిరుపేద మహిళకు ఒక నెలకు సరిపడ నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. అనంతరం మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ యువకులు తమ ఇంట్లో జరిగే శుభకార్యాలకు హంగు ఆర్భాటాలకు పోకుండా సేవా కార్యక్రమాల వైపు ఆలోచించడం చాలా గొప్ప విషయమని చైతన్య స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా బొడ్డు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో గతంలో అనేక రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని, ఈరోజు వినయ్ శ్రీమతి పుట్టినరోజు సందర్భంగా నిత్యవసర సరుకులు పంపిణీ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. దీనిని ఆదర్శంగా తీసుకొని మరింత మంది యువత సేవా కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొనాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేము కనకయ్య ,స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు ప్రదీప్, సమ్మయ్య యాదవ్ ,వేము అంజి యాదవ్,మామిడి హరీష్, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**కబురు న్యూస్, భూపాలపల్లి.జిల్లా**

యోగ ముద్రలో ఈ క్షేత్రమునందు వెలసిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారిని "మానసిక రోగము"లను నివారించే పరమాద్భుత మూర్తిగా భక్తులు విశ్వసిస్తారు. తీవ్రమైన మానసిక వ్యాధులతో భాధపడుచూ గొలుసులతో బంధింపబడి ఈ క్షేత్రమునకు తేబడిన వ్యాధిగ్రస్తులు ఒక మండలము (40) రోజులు ఉదయం, సాయంత్రం క్రమము తప్పకుండా శ్రీస్వామి వారికి ప్రదక్షిణలు గావించి, శ్రీ స్వామి వారిని అర్చించి, తీర్థము స్వీకరించి, సాంబ్రాణి పొగ వేసుకుంటే వారి వ్యాధులు నయం అవుతాయి. మానసిక వ్యాధులే కాకుండా భూత, ప్రేత పిశాచాది, శారీరక భాధగ్రస్తులు, దారిద్ర్య ఋణగ్రస్తులు మరియు సంతానములేని వారు అర్చించినంత మాత్రముననే వారి సకల కోరికలు నెరవేరుతాయి. ఈ ఆలయము నందు పాంచరాత్ర ఆగమ సాంప్రదాయానుసారము ప్రతి నిత్యము త్రికాల (ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం) వేళలో నివేదనలు అర్చన నీరాజన మంత్ర పుష్పములు జరుపబడుతాయి. ఈ క్షేత్ర సందర్శన గావించి, అర్చన, నీరాజన, మంత్ర పుష్పములతో శ్రీ స్వామివారిని సేవించిన భక్తులకు శ్రీ లక్ష్మీనృసింహ స్వామివారు కటాక్షించి, సామీప్యం, సాలోక్య, సారూప్య, సాయుజ్యములచే ముక్తి చతుష్టయమును అనుగ్రహిస్తారనుటలో ఏ మాత్రమైననూ సందేహము లేదు. శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము నూతన గుడి నిర్మాణ నమూన కరవీర సుమాభూషా ్ణక్షురానంద మూర్తయే కొడవటంచ నివాసాయా నృసింహాయ మంగళం



సదా శ్రీ స్వామివారి సేవలో..... ముల్కనూరి బిక్షపతి చైర్మన్ & కమిటీ సభ్యులు అర్చకులు & సిబ్బంది ఎస్. మహేష్ కార్యనిర్వహణాధికారి శ్రీ స్వామివారి కళ్యాణము రూ౹౹1,116/- దంపతులకు మాత్రమే (తలంబ్రాల రోజు) శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవ కార్యక్రమములు - 2025

తేది: 09-03-2025 ఆదివారం
ఫాల్గుణ శుద్ధ దశమి
ఉదయం 9.00 గం,,లకు : అభిషేకం, సూర్యవాహన సేవ,
సా,, 6.00 గం,, లకు
: శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవ - జాతర కార్యక్రమములు ఆరంభము
: శేషవాహన సేవ (పుట్ట బంగారు సేవ), అంకురారోహణము

తేది : 10-03-2025 సోమవారం
ఫాల్గుణ శుద్ధ ఏకాదశి
సా,, 8.00 గం,, లకు
మ,, 12.00 గం,, లకు
: ధ్వజారోహణము (గరుడముద్ద)
రా౹౹ 8.00 గం౹౹ ల నుండి
: అశ్వవాహన సేవ, పల్లకి సేవ, ఎదురుకోళ్ళు
9.00 50
: శ్రీ స్వామి వారి కళ్యాణము (తలంబ్రాలు)

తేది : 11-03-2025 మంగళవారం
ఫాల్గుణ శుద్ధ ద్వాదశి
ఉ,, 8.00 గం,,లకు
: నిత్యవిధి, హెూమము, బలిహరణములు
ఉ,, 9.00 గం,, లకు
: గజవాహన సేవ
రా౹౹ 8.00 గం,, లకు
: చంద్రవాహన సేవ

తేది : 12-03-2025 బుధవారం
ఫాల్గుణ శుద్ధ త్రయోదశి
ఉ,, 8.00 గం,,లకు
: నిత్యవిధి, హెూమము, బలిహరణములు
ఉ,, 10.00 గం,,లకు
: సింహవాహన సేవ
రా౹౹ 8.00 గం,,లకు
: గరుడోత్సవము, సదస్యము

తేది : 13-03-2025 గురువారం
ఫాల్గుణ శుద్ధ చతుర్దశి
ఉ,, 8.00 గం,,లకు
: నిత్యవిధి, హెూమము, బలిహరణములు
8.00
: హనుమంతవాహన సేవ
రా౹౹ 10.00 గం,,లకు
: చిన్న రథ సేవ, దోపోత్సవము
ఉ,, 8.00 గం,,లకు
: హెూమము, బలిహరణములు
మ,, 12.00 గం,,లకు
: మహా పూర్ణాహుతి
సా,, 5.00 గం,,లకు
సా,, 7.00 గం,,లకు

తేది : 14-03-2025 శుక్రవారం
ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి
: బోనములు తిరుగుటతో (యానోత్సవము) శ్రీస్వామివారి జాతర ప్రారంభం
: పెద్ద రథోత్సవం, ఎడ్లబండ్లు, ప్రభ బండ్లు, ఇతర వాహనములు తిరుగుట

తేది : 15-03-2025 శనివారం
ఫాల్గుణ బహుళ పాడ్యమి
ఉ,, 10.00 గం,,లకు
: శ్రీ స్వామివారి మరియు అమ్మవార్ల గజ వాహనముల ఊరేగింపు.
ఉ,, 8.00 గం,,ల నుండి
: చక్రస్నానం, అభిషేకం

తేది : 16-03-2025 ఆదివారం
ఫాల్గుణ బహుళ విదియ
ఉ,, 10 గం,,ల నుండి 11 వరకు
: శ్రీ స్వామి వారి నిజ రూప దర్శనం.
రా౹౹ 8.00 గం,,లకు
రా౹౹ 9.00 గం,,లకు
: హంసవాహన సేవ
: శ్రీ పుష్పయాగం (నాకబలి)

బ్రహ్మోత్సవ సమయంలో సమయానుకూలంగా హరి కథలు, సాంస్కృతిక కార్యక్రమములు, పండితోపన్యాసములు జరుపబడును.
ఆలయంలో పరిశుభ్రత పాటించండి- దేవాలయ అభివృద్ధికి సహకరించండి.
4

# అంతర్గత రోడ్లకు మహర్దశ..

**- రహదారుల నిర్మాణానికి రూ.4.25 కోట్లు మంజూరు..**
**- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వెల్లడి...**

**కబురు న్యూస్, శంకరపట్నం మార్చి 9**

మానకొండూర్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.4.25 కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మానకొండూర్ మండలానికి రూ.1.20 కోట్లు..మానకొండూరు మండలానికి కోటి 20 లక్షలు మంజూరు కాగా ఊటూరుకు గ్రామానికి 25 లక్షలు, పచ్చునూరుకు 35 లక్షలు, రంగపేట్ కు 25 లక్షలు, లలితాపూర్ కు 15 లక్షలు, నిజాయితీ గూడెంకు 20 లక్షలు మంజూరైనట్టు ఆయన వివరించారు. తిమ్మాపూర్ మండలానికి రూ.1.80 కోట్లు..తిమ్మాపూర్ మండలానికి కోటి 80



లక్షల రూపాయలు మంజూరైనట్టు ఎమ్మెల్యే తెలిపారు. తిమ్మాపూర్ గ్రామానికి 15 లక్షలు, మహాత్మా నగర్ కు 70 లక్షలు, నల్లగొండకు 40 లక్షలు, పోలంపల్లికి 10 లక్షలు,మల్లాపూర్ కు 10 లక్షలు,కొత్తపల్లికి 20 లక్షలు వెరసి కోటి 80 లక్షలు మంజూరైనట్టు ఆయన వివరించారు. శంకరపట్నం మండలానికి రూ. 1.05 కోట్లు...శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి 20 లక్షలు, మెట్ పల్లి గ్రామానికి 20 లక్షలు, అంబాలాపూర్ కు 10 లక్షలు, కన్నాపూర్ కు 10 లక్షలు, కేశవపట్నానికి 10 లక్షలు , కరీంపేట్ కు 10 లక్షలు, ముత్తారం గ్రామానికి 15 లక్షలు, శంకరపట్నం మండలానికి మొత్తం కోటి 5 లక్షలు మంజూరైనట్టు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వివరించారు. గన్నేరువరం మండలానికి రూ.20 లక్షలు...గన్నెరువరం మండలానికి మొత్తం 20 లక్షలు మంజూరు కాగా గుండ్లపల్లి కి పది లక్షలు మాదాపూర్ కు 5 లక్షలు, చొక్కారావు పల్లెకు ఐదు లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే సత్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా ఆయా మండల, గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, ప్రజలు గ్రామాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సత్యనారాయణకు నిధులు విడుదలకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఏఐటీయూసీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ మీటింగ్ లో రాజేష్ ఖన్నా..

**- ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా**

**కబురు న్యూస్,శంకరపట్నం మార్చి 9**

హైదరాబాద్ హిమాయత్ నగర్ లో ఆదివారం సత్యనారాయణ రెడ్డి భవన్ లో ఎఐటియుసి స్టేట్ కౌన్సిల్ మీటింగ్ హాజరైన ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ కన్నా మాట్లాడుతూ కనీస వేతనాలు వెంటనే అమలు చేయాలి ఇప్పటికే కేంద్రము 60 శాతం మరియు 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులతో నడుస్తున్న ఎన్ హెచ్ ఎం స్కీమ్ ఉద్యోగస్తులను శ్రమ దోపిడీకి గురిచేస్తుంది , గత బీఆర్ఎస్ ప్రభుత్వం 510 జీవో 2018 రిలీజ్ చేసిందని అందులో కొన్ని క్యాడర్లకు మాత్రమే వేతనాలు పెంచడం మరి కొంతమందికి




పెంచకపోవడం కొన్ని క్యాడర్స్ మిస్ చేయడం మిస్సయిన క్యాడర్లో 4000 మంది ఉద్యోగులు ఉన్నారని, మిస్సయిన క్యాడర్స్ అందరికీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం 4,000 మంది ఉద్యోగులకు క్యాడర్ ఫిక్స్ చేసి రెగ్యులర్ ఉద్యోగుల యొక్క బేసిక్ వేతనాన్ని వెంటనే అమలు చేయాలని, హెల్త్ కార్డ్స్ ,హెల్త్ ఇన్సూరెన్స్ ,మహిళా ఉద్యోగస్తులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ప్రతి క్యాడర్కు 30 శాతం వెయిటేజ్ మార్కులు అమలు చేయాలని, ఏడు నెల పి.ఆర్.సి. ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని, అతి తక్కువ జీతాలు చెల్లించడం అన్యాయమని ఉద్యోగులందరూ డిస్టిక్ సెలక్షన్ కమిటీ ద్వారా నియమించడం జరిగిందినీ , ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఐదు రాష్ట్రాలలో రెగ్యులరైజేషన్ చేశారని, రెగ్యులరైజేషన్ చేసిన రాష్ట్రాలు పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర ,మణిపూర్, హిమాచల్ ప్రదేశ్ కావున తెలంగాణ రాష్ట్రంలో కూడా రెగ్యులరైజేషన్ చేయాలని ఈ సభ ముఖంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్ రాజ్ , ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, ఏఐటీయూసీ ఉపాధ్యక్షురాలు ప్రేమ పావని, ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్ , వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిమ్స్ ఒలంపియాడ్ హంట్ లో సెయింట్ జోసెఫ్ విద్యార్థినికి స్టేట్ 5వ ర్యాంక్

**కబురు న్యూస్, జమ్మికుంట మార్చి 9**




రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ఏడవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు ఎయిమ్స్ ఒలంపియాడ్ హంట్ వారు నిర్వహించిన వివిధ ప్రామాణిక పరీక్షల్లో పోటీపడి జమ్మికుంట సెయింట్ జోసెఫ్ స్కూల్ కు చెందిన 8వ తరగతి విద్యార్థిని నిహా తన్నజ్ స్టేట్ 5వ ర్యాంక్ సాధించింది. ఇదే స్కూల్ కు చెందిన 7వ తరగతి విద్యార్థిని కే. విశ్వశ్రీ జోనల్ లెవల్ లో 9వ ర్యాంక్ సాధించింది. ఎయిమ్స్ ఒలంపియాడ్ హంట్ ఫైనల్ విన్నర్లుగా నిలిచిన వీరికి ఈ రోజు హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఘనంగా సన్మానం చేసి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కడియాల ప్రభాకర్ రావు, గుడ్ షెఫర్డ్ & యూనిక్ చిల్డ్రన్ కేర్ వ్యవస్థాపకులు ఎండి ఖలీముల్లాఖాన్ పాల్గొని విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే తరంలో డాక్టర్లుగా , ఇంజనీర్లుగా సేవనందించే మీరు ఉన్నత విలువలు, క్రమశిక్షణ పాటిస్తూ ఇష్టపడి చదవాలని మీకు, మీ తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.
ఈ సందర్భంగా సెయింట్ జో స్కూల్ కరస్పాండెంట్ వై.సునీల్, ప్రిన్సిపల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వీరికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన..



**కబురు న్యూస్, జమ్మికుంట మార్చి 9,**

జమ్మికుంట పట్టణంలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణురాలు (యూరాలజిస్ట్) డాక్టర్ గీతాంజలి నరేష్ చే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 13 కిడ్నీ డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే రానున్న వేసవిలో అందరూ ఎండలలో ఎక్కువగా తిరగడం వలన శరీరం డీహైడ్రట్ అయ్యే అవకాశాలు ఉంటాయి. కాబట్టి పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ వేసవిలో శీతల పానీయాలు కాకుండా కొబ్బరినీళ్లు నిమ్మరసం లాంటివి సేవించాలని అన్నారు. అనంతరం మేనేజ్మెంట్ డాక్టర్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ యొక్క ఉచిత మెగా శిబిరంలో ఉచిత కన్సల్టెన్సీ తో పాటు కిడ్నీలను, కిడ్నీలో రాళ్లను పరీక్షించే స్కానింగ్, సిరం క్రియాటిన్ (కిడ్నీ యొక్క పనితీరు పరీక్షించే పరీక్ష), మూత్ర పరీక్ష తుపార్టు పలు ఉచిత సేవలు కల్పించినట్లు తెలిపారు.

# సంపత్ బాధ్యత కుటుంబానికి చేయూత....

**- కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు..**

**కబురు న్యూస్,శంకరపట్నం మార్చి 9**





స్వచ్ఛంద సేవా కార్యకర్త మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రాల సంపత్ ఓ బాధిత చేయూతనందించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, కేశవపట్నం గ్రామానికి చెందిన సుతారి రాంబాబు, గొల్లపల్లి కనకయ్య అనే వ్యక్తులు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, తన వంతు సహాయంగా బియ్యం అందజేసినట్లు సంపత్ తెలిపారు ఈ కార్యక్రమంలో రాచర్ల సమ్మయ్య, ఎండి నవాబ్, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

# పోతరవేణి భాస్కర్ మృతి తీరని లోటు..

**కబురు న్యూస్, రామగిరి మార్చ్ 09.**




పాముల భాస్కర్ గా సుపరిచితుడైన రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన పోతరవేణి భాస్కర్ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నేత దాసరి శివ సంతాపం వ్యక్తం చేశారు. బేగంపేట గ్రామంతో పాటు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల ప్రజలను విష సర్పాల బారి నుండి పోతరవేణి భాస్కర్ కాపాడుతూ ప్రజలకు సేవ చేశాడని దాసరి శివ గుర్తు చేశాడు. పాములను పట్టే నైపుణ్యాన్ని భాస్కర్ ఇతరులకు కూడా నేర్పించాడని మృతుడి సేవలను కుటుంబ పరిస్థితిని మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి

# మహిళలు స్వయం స్వావలంబన దిశగా అడుగులు వేయాలి

**– రేండ్ల శారద కుమారస్వామి**

**కబురు న్యూస్, రామగిరి మార్చ్ 09.**
మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగిరి మండలం కల్వచర్ల గ్రామ మహిళలకు గతంలో ఆర్ఎస్కె ఆపన్నహస్తం ద్వారా రేండ్ల శారద కుమారస్వామి నాలుగు బ్యాచులుగా మహిళలకి ఉచిత కుట్టు మిషన్ శిక్షణను ఇప్పించి వారికి పరీక్షలు నిర్వహించి ఆదివారం ఎన్ఎసి ఆధ్వర్యంలో మహిళలకి సర్టిఫికెట్లు,ఒక చిరు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా రేండ్ల శారద కుమారస్వామి మాట్లాడుతూ మహిళలు స్వయం స్వావలంబన దిశగా అడుగులు వేయాలని ఆలోచించి వారికి ఏ రంగంలో ఆసక్తి ఉందో గమనించి ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆర్ఎస్కె ఆపన్నహస్తం ద్వారా నేర్చుకున్న మహిళలందరూ నేర్చుకున్న తమ విద్యను ఆచరణలో పెట్టడంతో పాటుగా ఇతరులకి నేర్పించే దిశగా వెళ్లాలని కోరుకున్నారు. దీనివలన మహిళలకు చిరు ఉపాధి అయిన అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మీ సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేయడానికి ముందు వరసలో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ బోర్డు మెంబర్ కటారి రేవతి రావు,లెన్స్ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ కంకటి శ్రీనివాస్,వైద్యులు,గ్రామస్తులు,మహిళలు పాల్గొన్నారు.





# రత్నపూర్ గ్రామపంచాయతీ కి నిధులు మంజూరు

**– మంత్రి శ్రీధర్ బాబు కు కృతజ్ఞతలు తెలిపిన ఎస్సీ సెల్ అధ్యక్షులు**

**కబురు న్యూస్, రామగిరి మార్చ్ 09.**
రామగిరి మండలంలోని రత్నపూర్ గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీలో 10 లక్షల సీసీ రోడ్డు,రామగిరి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీ లో సీసీ రోడ్ లు మంజూరు చేసిన నాయకులు తెలంగాణ రాష్ట్ర ఐటి,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,యువ నాయకులు దుద్దిళ్ల శ్రీను బాబు కు,సహకరించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్,రామగిరి మండల అధ్యక్షులు రొడ్డ బాపన్న కు రామగిరి మండల,రత్నపూర్ ఎస్సీ కాలనీ ప్రజలందరి తరపున రామగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కండే పోషం కృతజ్ఞతలు తెలిపారు.



# వేసవిలో మంచి ఎద్దడి నివారించాలి...



**– మిషన్ భగీరథ అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ఆదేశం...**

**కబురు న్యూస్, శంకరపట్నం మార్చి 9**
వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఎల్ఎండి కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మిషన్ భగీరథ అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, ఈ దిశగా సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాల్సిం దిగా అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో మిషన్ భగీరథ పైపులైన్ పనులు, శుద్ధి కేంద్రాల నిర్వహణ, నీటి సరఫరా సమస్యలు, గ్రామాల్లో తాగునీటి అవసరాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ పర్యవేక్షక ఇంజనీర్ కె రాములు, కార్యనిర్వక ఇంజనీర్లు రామ్ కుమార్, ఎఈఈలు ఏ మౌనిక, కే అనిల్ కుమార్ ఈ రాజకుమార్ ఎస్ చందు, డిఈఈ వసీద్దిన్ హైమద్, డీఈఈ జి ప్రసాద్ కుమార్, ఎఈలు ఎం విలాస్ ఎం కార్తీక్ తోపాటు సంబంధిత విభాగాల ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సమాజానిక్ఫిరీర్తిదాయకమైన సినిమా చావా

**కబురు న్యూస్, చింతకాని**
ఈ రోజు ఖమ్మం వినోద థియేటర్లో లో ప్రదర్శించినటు వంటి చావా చిత్రాన్ని చింతకాని మండలం భారతీయ జనతా పార్టీ నాయకులతో చిత్రాన్ని వీక్షించడం జరిగింది ఈ చిత్రంలో శివాజీ మహారాజ్ తనయుడు సంభాజీ మహారాజ్ ఆనాడు మొగలాయులపై చేసినటువంటి పోరాటాన్ని కన్నులకు కట్టినట్లుగా చిత్రీకరించి నేటి యువతకు స్ఫూర్తినిచ్చారు. హిందూ మత స్వరాజ్య స్థాపన కోసం మరియు దేశ భక్తి ప్రేరేపితమైన సినిమాను ప్రతి పౌరుడు తప్పకుండా వీక్షించాలని విజ్ఞప్తి చేశారు నేటి తరుణంలో విభిన్న సినిమాలు వస్తున్న సమయంలో ఈ చావా'సినిమా రావడం గర్వంగా ఉందన్నారు సమాజానికి ఇంతటి స్ఫూర్తిదాయకమైన ఈ సినిమాను తీసిన చిత్ర బృందానికి నిర్మాతలకు నటీనటులు అందరకు కూడా ప్రత్యేకమైన కృతజ్ఞతలు అభినందనలు తెలియజేస్తూ మరొక్కసారి ప్రతి పౌరుడు కూడా ఈ చిత్రాన్ని చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ చిత్రాన్ని వీక్షించిన వారిలో బీజేపీ కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో డీఎస్పీ మృతి

**కబురు న్యూస్, సిద్దిపేట్ మార్చి 09,**
తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లాలో రోడ్డు ప్రమాదంలో డీఎస్పీ మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా కుకునూర్ పల్లి మండలం లో చోటుచేసుకుంది. కుకునూర్ పల్లి ఎస్ఐ పి. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ డీఎస్పీ బి.జవహర్ లాల్(50) సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని రాజ్ గోపాల్ పేట గ్రామ శివారులోని ఫైరింగ్ రేంజ్ లో ఇన్ సర్వీస్ కానిస్టేబుల్స్ కు నిర్వహించిన ఫైర్ టెస్టింగ్ ను పూర్తి చేసుకుని తిరిగి మేడ్చల్ కు కారులో వెళ్తున్నారు. మార్గమధ్యలో కుకునూర్ పల్లి మండలం చిన్నకిష్టాపూర్ చౌరస్తా వద్ద చిన్నకిష్టాపూర్ గ్రామం వైపు నుంచి వస్తున్న కారు ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకుండా రాజీవ్ రహదారిపై హైదరాబాద్ వైపు తిప్పడంతో ఆ కారు ను తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న అడ్వటైజ్మెంట్ బోర్డు ను ఢీకొట్టింది. కారు లో ఉన్న మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ డీఎస్పీ బి. జవహర్ తలకు, ఛాతీలో గాయాలు గాక కారు డ్రైవర్ కాళ్లకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వారి వెనుకే వస్తున్న మేడ్చల్ పి టి సీ సిబ్బంది వారిని ములుగు మండలంలోని లక్ష్మక్క పల్లి గ్రామ శివారు లోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ డీఎస్పీ బి జవహర్ లాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



# ఆన్లైన్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసుల భోధన



**కబురు న్యూస్, దినపత్రిక. మార్చి 9**
ముంబై తూర్పు సాంతక్రుజ్ లోని నవ భారత్ సేవా సంఘంలో అంతర్జాతీయ మహిళా 114వ దినోత్సవ వేడుకల్ని మహిళా అధ్యక్షులు మీనా తొర్లికొండ, సలహాదారు జేమ్స్ దేవా, అధ్యక్షులు సాగర్ మేడి, కార్యదర్శి సదానంద్ సుంకరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సభకు విచ్చేసిన మహిళలకు స్నాక్స్, లేడీస్ పర్స్, ఫ్లవర్స్, ప్రత్యేక "ఉమన్స్ డే కేక్" తదితర సామాగ్రి భారతీ సుంకరి స్పాన్సర్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి "నిర్భయ్ బృందం" కు చెందిన పోలీస్ అధికారులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా మహిళా పి.ఎస్.ఐ పగారే మేడం మాట్లాడుతూ అందరికి మహిళ దినోత్సవం శుభాకాంక్షలు తెల్పారు. ఈమధ్య సమాజంలో జరగుతున్న ఆన్లైన్ మోసాల గురించి వివరిస్తూ వాటి నుంచి అప్రమత్తంగా ఉండాలంటూ పలు మంచి ఉపాయాలు ప్రజలకు సూచించారు. చివర్లో సంఘం కోశాధికారి ప్రవీణ్ జంగం హాజరైన వారందరికీ ధన్యవాదాలు తెల్పారు. అదే తరహాలో సాంతక్రూజ్ లోని అగ్నిజ్వాల చర్చిలో మహిళా దినోత్సవ సంబురాలు జరిపారు. చర్చి ఆత్మీయురాలైన భారతీ సుంకరి ద్వారా మహిళలందరికీ పుష్పగుచ్చాం, చేతి పర్స్ పంపిణీ జరిగింది. ఈ మేరకు పాస్టర్ ప్రభుదాస్ సుంకరి ప్రత్యేక వందనాలు తెల్పారు. ఇందులో సండే స్కూల్ టీచర్ మరియా కెవ్డా, సప్నా బొజ్జా, సుఖద సుంకరి, ప్రియా మానె, మంగళ్ సూర్యవంశీ, సుజాత పిల్గిరి, సాటెక్కా తదితర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# నామకరణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు



**కబురు న్యూస్, రామగిరి మార్చి 09**
ఆదివారం రోజు రామగిరి మండలంలోని పన్నూర్ గ్రామానికి చెందిన కాంగ్రెసు పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ చిందం మౌనిక – మహేష్ గార్ల కుమారుడి నామకరణ మహోత్సవానికి హాజరై ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేసిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ వారితో పాటు రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న మరియు ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు మరియు రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# స్కై చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మహిళ దినోత్సవం



**కబురు న్యూస్, మేడ్చల్ మల్కాజ్గిరి మార్చి 9**
114వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్కై ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మాన్ స్త్రీ శక్తిచా (మహిళ శక్తికి సన్మానం) పేరున ముంబై సాయిన్లోని కొకరిఅగర్లో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నేడు ప్రపంచమంతటా మహిళ లోకం తాము సాధించిన సామాజిక సాంస్కృతిక విద్యాపరమైన అభివృద్ధిని నెమరు వేసుకునే సమయం. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ఎదుగలనే తపన ఉంటుంది. దానికి పురుషులు అన్ని అంగుళాల్లో సహకారం అందిస్తున్నారన్నది విధితమే. ఈ కార్యక్రమంలో భారత దేశ ఆదర్శ వీర మహిళామణులైన రాజమాత జిజావు, సావిత్రిమాయి పూలే, అయిల్యామాయి హెూల్కర్ లను జ్ఞాపకం చేసుకున్నారు. అనంతరం హాజరైన స్త్రీలకు అథితులచే బహుమానాలు, ప్రశస్తి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ట్రస్ట్ అధ్యక్షుడు సుశీల్కుమార్ సుంకి, కార్యదర్శి రాజేంద్రప్రసాద్ కొండా,కోశాధికారి ఆదర్శ్ సుంకి,ఉదయ్ శ్రీపతి లతోపాటు శ్రద్ధా గోలే, జన నెల్గే, రేవతి ఖువడ్, కుసుం జాదవ్,జమ్న మలింగ్, గీత షేలార్, రజనీ గుండాల, రాజేశ్రీ సుంకి తదితర్లు ఉన్నారు. ఇందులో అన్ని భాషల స్త్రీలు మంచి సంఖ్యలో హాజరై ఉత్సవంగా పాల్గొన్నారు.

# అఖిలభారత పద్మశాలి మహాసభకు తరలివెళ్లిన నేతన్నలు..



**కబురు న్యూస్, హైదరాబాద్/వీణవంక, మార్చి 9.**
తెలంగాణ ప్రాంత పద్మశాలి 8 వ మహాసభ, ఆదివారం హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ నాంపల్లిలో జరగగా,వీణవంక మండలం నుండి ఆలె మధుసూదన్ నాయకత్వంలో 21 మంది పద్మశాలి నాయకులు మహాసభకు తరలి వెళ్లడం జరిగింది. ఈ సభకు వెళ్ళిన వారిలో గంగారం మాజీ సర్పంచ్ కుమారస్వామి, గాదె గుణ సాగర్, ఉయ్యాల చంద్రమౌళి, అడిగొప్పుల వెంకన్న, బూర శీను తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణులకు అందుబాటులో అద్దె వాహనాలు.. ఎస్పీ ట్రావెల్స్ వీణవంక...

**– మేనేజింగ్ డైరెక్టర్.. గోపు రాజేష్..**

**కబురు న్యూస్, వీణవంక, మార్చి 9.**
వీణవంక మండల ప్రజలకు అత్యవసర సమయాలలో హాస్పిటల్స్, పట్టణాలకు, వివాహాలకు, విహారయాత్రలకు, జాతరలకు వెళ్లేందుకు వీలుగా, వీణవంక ఎస్పీ ట్రావెల్స్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్లు, బస్సు, డీసీఎం అన్ని రకాల అద్దె వాహనాలు సరసమైన ధరలకే లభిస్తాయని, అద్దె వాహనాల అవసరమున్నవారు సెల్ 9866902196,9866950219,9908878944 నంబర్లలో సంప్రదించగలరని, ఎస్పీ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ గోపు రాజేష్, డైరెక్టర్లు సుకాశి సురేష్, నీల పున్నం చందర్ మండల ప్రజలను కోరుతున్నారు.




# వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు....

**కబురు న్యూస్, జమ్మికుంట, మర్చి9**
జమ్మికుంట పట్టణం వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వాసవి వ్రత క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో మహిళలందరూ కలిసి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. పలువురిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మాట్లాడుతూ మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. ప్రతి కుటుంబం విజయం వెనుక మహిళల పాత్ర ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షులు స్వామి శెట్టి అఖిలాండం, సెక్రెటరీ నూక సంధ్యారాణి,ట్రెజారేరి దోమ కుంట్ల జ్యోతి, ఆర్ సి అయిత రమాదేవి,వాసవి వనితా క్లబ్ ప్రముఖులు క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా కళాకారుడు అమరజీవి కామ్రేడ్ జాకబ్ చిరస్మరణీయుడు...

- ప్రజా, కార్మిక కళాక్షేత్రంలో సాంస్కృతిక సేనాని జాకబ్ సేవలు మరువలేనివి.
- విగ్రహా ఆవిష్కరణ స్మారక సభలో వక్తలు.



కబురు న్యూస్,రామగుండం మార్చి, 09:
ప్రజా కళాకారుడు అమరజీవి కామ్రేడ్ జాకబ్ చిరస్మరణీయుడని, ప్రజా, కార్మిక కళాక్షేత్రంలో సాంస్కృతిక సేనానిగా జాకబ్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని న్యూ అశోక్ థియేటర్ వద్ద ప్రజా నాట్యమండలి ఏర్పాటు చేసిన జాకబ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం స్థానిక భాస్కర్ రావు భవన్ లో జరిగిన స్మారక సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కామ్రేడ్ జాకబ్ సింగరేణి ఉద్యోగి గా ఉంటూ సిపిఐ, ఏఐటియుసి కి అనుబంధం గా ఉన్న ప్రజానాట్యమండలిలో జాతీయ స్థాయిలో ప్రజలకు, కార్మికుల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం తన రచనల ద్వారా, పాటల ద్వారా ప్రజా, కార్మిక కళాక్షేత్రంలో సాంస్కృతిక సేనానిగా ఉంటూ సేవలు అందించి పలువురి ప్రశంసలు అందుకున్నాడని ఆయన పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే జాకబ్ అభ్యుదయ భావాలను అలవర్చుకొని కళ ప్రజల కోసం అని నమ్మి ప్రజా నాట్య మండలి, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ జాతీయ నాయకులు గా ఎదిగాడని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జాకబ్ ప్రజా కళల కోసం అంకిత భావంతో పాటు పడినాడని, రచయిత గా, నటుడిగా, గాయకుడి గా, దర్శకుడి గా బహుముఖ ప్రజ్ఞాశాలి గా వెలిగొందాడని, సింగరేణి లో కోల్ ఇండియా స్థాయి లో గజళ్ళు గానం చేసి దాదాపు ఇరవై సార్లు సింగరేణి తరపున ప్రాతినిధ్యం వహించి పది రాష్ట్రాల్లోనూ ప్రతిభను చూపి కంపెనీ ఖ్యాతి ని ఇనుమడింప చేసి గొప్ప కళాకారుడి గా రాణించాడని వారు పేర్కొన్నారు. పదవి విరమణ చేసిన తర్వాత తన శేష జీవితాన్ని కళకే అంకితం చేద్దామనే ఆలోచనలో ఉన్న జాకబ్ గుండె పోటు తో తన ప్రాణాలను కోల్పోవడం కళాకారులకు తీరని లోటని వారు పేర్కొన్నారు. జాకబ్ ఆశయాలను, ఆయన కళారూపాలను కొనసాగించాలని అప్పుడే ఆయనకు ఘన నివాళులు అర్పించిన వారమవుతామని వారన్నారు.

# నిరుపేద వధువు వివాహానికి పుస్తె మట్టెలు అందజేసిన మోహన్ నాయక్



కబురు న్యూస్, నిజాంపేట్ 09-03-25
నిజాంపేట మండల పరిధిలోని శౌకత్ పల్లి గ్రామానికి చెందిన రమావత్ రాజు,బుజ్జి,ల కుమార్తె సంధ్య వివాహానికి ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ మోహన్ నాయక్ పుస్తె మట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ గిరిజన బిడ్డ అయిన డాక్టర్ మోహన్ నాయక్, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆర్థిక సహాయాలు అందజేస్తున్న ఆయనకు భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమావత్ రాజు, రాజు నాయక్, నరేష్ నాయక్, పత్తి నాయక్, సూర్య నాయక్, బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అవమానం.. ఇది కుల అహంకారమే!

- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ఆరోపణ



కబురు న్యూస్, కోరుట్ల మార్చి 9
భారత రాజ్యాంగ నిర్మాత, విశ్వరత్న డాక్టర్ బాబాసాహెబ్ బి ఆర్ అంబేద్కర్ గారి విగ్రహనికి చెప్పుల దండతో అవమానించడమంటే కుల అహంకారంతో విర్రవిగే వారి వల్లేనని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ,అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ఆరోపించారు. ఆదివారం సారంగపూర్ మండలం నాగునూర్ లో అవమానానికి గురైన అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించిన పేట భాస్కర్ సంఘ నాయకులతో కలిసి విగ్రహనికి పాలభిషేకం చేసి పూల దండలు వేశారు. అనంతరం పేట భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అంబేద్కర్ కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే అక్కసుతో కుల అహంకారులు ఈ దుర్ఘటనకు పాల్పడ్డారని వారు ఎంతటి వారైన దేశ ద్రోహం కేసు నమోదు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని పేట భాస్కర్ డిమాండ్ చేశారు. దేశమంతా అంబేద్కర్ యిజం అవసరమని దేశం కోసం ఆయన చేసిన త్యాగాలకు ఎవరు సరిపోరని అంతటి మహానీయుడి విగ్రహాన్ని అవమానించడం సబాబుగా లేదని మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మహానీయుల విగ్రహాలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పేట భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షులు బోనగిరి మల్లారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎలిశెట్టి గంగారెడ్డి, అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జెల రాజు,మండల అధ్యక్షులు పుడూరి శోభన్, గ్రామ అధ్యక్షులు ఎవుసం గంగాధర్, జిల్లా నాయకులు శనిగారపు రాజేష్, జాగర్ల రాజయ్య, స్థానిక నాయకులు మచ్చ జగన్,రాహుల్, వంశీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కబురు న్యూస్, నిజాంపేట్ 09-03-25
నిజాంపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఆదివారం మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణలో సీసీ రోడ్డు పనులకు సహకరించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మైనంపల్లి హనుమంతరావు లకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముదిరాజ్ సంఘం కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మారుతి,పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్, మాజీ సర్పంచ్ కొమ్మాట సత్యనారాయణ, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్,వెంకటేష్ గౌడ్,సామల మహేష్, రాజు నాయక్,రాజేందర్ గౌడ్,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పంజా బాబు,ముదిరాజ్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్లుల్లలో పి డీఎస్ బియ్యం పట్టివేత.

.. సివిల్ సప్లై కి అప్పగించిన పిడిఎస్ బియ్యం.
..మెట్ పల్లి సీ. ఐ. నీరాంజన్ రెడ్డి.



కబురు న్యూస్,మెట్ పల్లి, మార్చి 9.
మాకు వచ్చిన సమాచారం మేరకు మెట్ పల్లి మండలం వెల్లుల్ల గ్రామ శివారులో అక్రమంగా పీడీ ఎస్ బియ్యం నిల్వ ఉందనే సమాచారం రాగా ఎస్సై కిరణ్ కుమార్, విజిలెన్స్ సిబ్బంది సంయుక్తంగా ఆ ప్రాంతానికి ఆదివారం వెళ్ళినార ని మెట్ పల్లి సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.వెళ్ళగా ఓ పాడుబడ్డ ఇంట్లో సుమారు 17 బస్తాల పీడీఎస్ బియ్యం (సుమారు 8 క్వింటాళ్ల 85 కిలోలు) ఉండగా విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో వంచనామా రాసి అట్టి పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకొని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయబడిందని సీఐ తెలిపారు అక్రమంగా పీడీ ఎస్ బియ్యం నిల్వ ఉంచిన వ్యక్తి పోలీసులు వస్తున్నది గమనించి అక్కడి నుండి పారిపో యినాడు. అతడు గత కొన్ని రోజుల నుండి మెట్టుపల్లి మండలంలోని చుట్టుపక్క గ్రామాలలో టీవీఎస్ బండి పై పీడీఎస్ బియ్యన్ని కొనుగోలు చేస్తూ వచ్చి ఒక దగ్గర బస్తాలు జమచేసి వాటిని నిజామాబాద్జిల్లాకు తరలిస్తున్నారని సమాచారం రాగా అట్టి సమాచారంతో వెళ్లి బియ్యంను పట్టుకోవడం జరిగిందని సీఐ నిరంజన్ రెడ్డి అన్నారు అక్కడి నుండి దొంగతనంగా బియ్యం తరలించిన వ్యక్తి పారిపోగా అతనిని ఆచూకీ కనుక్కొని వెంటనే అతనిని అదుపులోనికితీసుకుంటామని తరువాత అతనిని తదుపరి చర్య నిమిత్తం కోర్టులో హాజరుపరు స్తామని సీఐఏ నిరంజన్ రెడ్డి తెలిపారు. పిడిఎస్ బియ్యాన్ని ఎవరైనా కొన్నా అమ్మిన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు . పట్టుకున్న పిడిఎస్ బిర్యాని సివిల్ సప్లై అధికారు లకు అప్పగించినట్లు సీఏ నిరంజన్ రెడ్డి తెలిపారు. పిడిఎస్ బియ్యాన్ని అక్రమం గా వ్యాపారం చేసేవారు ఎంతటి వారైనా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్ రెడ్డి అన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత.



కబురు న్యూస్, గన్నేరువరం మార్చి 9
మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామస్తుడు లింగంపల్లి మొండయ్య సౌదీ అరేబియా దేశంలో అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని గుండ్లపల్లి మాజీ సర్పంచ్ బేతల్లి సమత రాజేందర్ రెడ్డి ఆదివారం పరామర్శించి మృతుని కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. మృతదేహం రాక కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు భరోసాను కల్పించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు లింగంపల్లి అనిల్, హరీష్, సత్తయ్య గౌడ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# నూతన బొగ్గు బ్లాక్ లను సింగరేణి సంస్థకే కేటాయించాలి..

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారిని కలిసిన సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయు సి ప్రతినిధులు.



కబురు న్యూస్, రామగుండం మార్చి, 09:
తెలంగాణ రాష్ట్రంలోని నూతన బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారికి వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ నూతన బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకి కేటాయించాలని సింగరేణి సంస్థ మనుగడని కాపాడాలని సత్తుపల్లి ఓసీ3, ఇల్లందు ఓసీ3, మరియు గతంలో అనుమతినిచ్చిన తాడిచెర్ల గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని వెంటనే ఉత్పత్తిని ప్రారంభించాలని మణుగూరు పీవీకే 5, కేటీకే ఓసీ ,ఇల్లందు ఓసీ లలో బొగ్గు తీసే పనులను కాంట్రాక్టర్లతో చేపించాలని యాజమాన్య నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని సింగరేణి సంస్థ లో పనిచేస్తున్న కార్మికుల ద్వారానే బొగ్గును తీపించాలని కొత్త గనుల కోసం టెండర్లు వేయాలని ఉపముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని వారు సానుకూలంగా స్పందించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, వైవి రావు, మడ్డి ఎల్లయ్య, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్కే బాజీ సైదా, ఆరెల్లిపోశం, జిగురు రవీందర్, ఎంఆర్సి రెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ భర్తను తిట్టిన తోట ప్రసాద్ పై కేసు నమోద్.

..మెట్ పల్లి ఎస్. ఐ. కిరణ్ కుమార్.

కబురు న్యూస్,మెట్ పల్లి, మార్చి 9.
మెట్ పల్లి పట్టణంలోని 15వ వార్డు మాజీ కౌన్సిలర్ భర్త ఆయన పిప్పరి రాజేష్ అనునతడు తనను తన భార్యపై గతంలో పోటీ చేసి ఓడిపోయిన బీజేపీకి చెందిన తోట ప్రసాద్ అను వ్యక్తి బూతులు తిట్టినట్లు రాజేష్ ఫిర్యాదు చేయగా ప్రసాద్ పై కేసు నమోదు చేసినట్లుమెట్పల్లి ఎస్సై కిరణ్ కుమార్ ఆదివారం తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో తాను అన్ని పార్టీల నాయకులతో తిరుగుతూ వారికి జోకుతూ బ్రతుకుతున్నావు అంటూ తాను రాజకీయ నాయకులతో దిగిన ఫోటోలను వాట్సాప్ గ్రూపు లలో వైరల్ చేస్తూ తనను అవమానపరచగా తాను వెళ్లి తోట ప్రసాదును ఇలా ఎందుకు వాట్సాప్ గ్రూపులలోతననుఅవమానపరుస్తున్నావని అడగగా బూతు మాటలు తిట్టి దూషించి చంపుతానని బెదిరించినాడని రాజేశ్ పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా తోట ప్రసాద్ పై ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుచున్నదని ఎస్ఐ తెలిపారు విచారణ పూర్తి అయిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ . ఐ ఏ కిరణ్ కుమార్ తెలిపారు.

# మోటార్ సైకిల్ వర్క్ షాప్ కమిటీ ఎన్నిక

కబురు న్యూస్, కోరుట్ల 09:
కోరుట్ల పట్టణంలో ఈరోజు నిర్వహించిన కోరుట్ల మోటార్ సైకిల్ వర్క్ షాప్ సొసైటీ ఆధ్వర్యంలో ఎలక్షన్లు నిర్వహించగా, అధ్యక్షుడిగా కటుకం గోవర్ధన్, ఉపాధ్యక్షుడిగా వాజిద్, ప్రధాన కార్యదర్శిగా అల్లే రమేష్, సహాయ కార్యదర్శిగా వడ్లకొండ రమేష్, కోశాధికారిగా మండలోజు అంజయ్య, గా ఎన్నికైనారు, అధ్యక్షుడు కటుకం గోవర్ధన్ మాట్లాడుతూ, తనను నమ్మి రెండవసారి అధ్యక్షుడిగా గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఎల్లవేళలా సొసైటీకి అందుబాటులో ఉంటూ, సొసైటీ అభివృద్ధికి సహకారం అందిస్తానని అని పేర్కొన్నారు,





# ఈ ఏడాదిలో 'వెలకమ్ టు ది జంగిల్' రాక

కబురు సినిమా మార్చి09:
బాలీవుడ్ కథానాయకుడు అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'వెల్‌కమ్ టు ది జంగిల్'. కామెడీ డ్రామా నేపథ్యంలో అహ్మద్ ఖాన్ తెరకెక్కిస్తున్నారు. జ్యోతిదేశ్ పాండే, ఫిరోజ్ ఎ.నడియాడ్ వాలా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఫిరోజ్ నడియాడ్ వాలా ఈ సినిమా గురించి పలు విశేషాలు పంచుకున్నారు. "యాక్షన్, కామెడీ మేళవింపుగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. మునుపెన్నడూ చూడని సన్నివేశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుంది. ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని ఆయన అన్నారు. 'వెల్‌కమ్' ఫ్రాంచైజీల్లో భాగంగా రూపొందుతున్న మూడో చిత్రమిది. ఇందులో దిశా పటానీ, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, రవీనా టాండన్, తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# అందరూ లాభపడ్డారు.. నాకు మాత్రం రూపాయి ఇవ్వలేదు: నటి



కబురు సినిమా మార్చి09:
పలు తెలుగు చిత్రాల్లోనూ స్పెషల్ సాంగ్స్‌లో కనిపించి ప్రేక్షకులను అలరించారు నటి నోరా ఫతేహి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె కెరీర్ విషయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి మాట్లాడారు. ముఖ్యంగా స్పెషల్ సాంగ్స్‌లో కనిపించినందుకు తనకు ఒక్క రూపాయి కూడా ముట్టని రోజులు ఉన్నట్లు చెప్పారు. తాను చేసిన పాటలు మాత్రం ఆయా సినిమాల కలెక్షన్స్‌లో కీలక పాత్ర పోషించాయని అన్నారు."పలు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌కు డ్యాన్స్ చేసి నేనెంతో గుర్తింపు తెచ్చుకున్నా. అవి ఇంటర్నెట్‌లో విశేష ఆదరణ సొంతం చేసుకున్నాయి. సినిమా విజయం, బాక్సాఫీస్ కలెక్షన్స్ విషయంలో కీలక పాత్ర పోషించాయి. దీని వల్ల నేను తప్ప అందరూ లాభపడుతున్నారని ఒకానొక సమయంలో అర్థమైంది. ఎందుకంటే ఆయా చిత్రబృందాలకు యూట్యూబ్‌తోపాటు వివిధ మార్గాల నుంచి రెవెన్యూ వస్తుంది. కానీ, నిర్మాతలు మాత్రం పారితోషికంగా నాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఉచితంగా నేను వాళ్లకు వర్క్ చేశా. బయట ఎక్కడైనా ప్రదర్శనలు ఇచ్చినప్పుడు మాత్రమే నాకు డబ్బు ముట్టేది. వ్యవస్థపై పోరాటం చేయాలని లేదు. అలాగని డబ్బు లేకుండా కేవలం పేరు మాత్రమే సొంతం చేసుకుంటే ఏం లాభం. భవిష్యత్తులో నా కుటుంబానికి ఏం ఇవ్వగలను. అందుకు అనుగుణంగా వర్క్ చేస్తున్నా. గుర్తింపుతోపాటు రెవెన్యూ కూడా అందుకునేలా పనిచేయాలనుకుంటున్నా" అని నోరా ఫతేహి తెలిపారు. స్పెషల్ సాంగ్స్‌లో వర్క్ చేయడానికి ఎలాంటి సమస్య లేదని ఆమె తెలిపారు. తనకు అవకాశాలు ఇస్తున్న దర్శక నిర్మాతలకు ఆమె ధన్యవాదాలు చెప్పారు.నోరా ఇదే విషయాన్ని గతంలోనూ వెల్లడించారు. కొంతమంది నిర్మాతల తీరు వల్ల కెరీర్ ఆరంభంలో తాను ఇబ్బందిపడ్డానని అన్నారు. అయితే డబ్బు కంటే గుర్తింపు పొందాలనే ఉద్దేశంతోనే వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నానని తెలిపారు. 'టెంపర్', 'బాహుబలి' 'కిక్ 2', 'షేర్', 'మట్కా' వంటి చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌కు ఆమె వర్క్ చేశారు.



# మరో స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ కొట్టేసిన నిధి అగర్వాల్..

కబురు సినిమా మార్చి09:
టాలీవుడ్ స్టార్ హీరోయిన్ నిధి అగర్వాల్ కి సినిమా ఆఫర్లు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఈ అమ్మడు తెలుగులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తదితర స్టార్ హీరోల సినిమాలలో హీరోయిన్ గా నటిస్తోంది. అయితే ఇటీవలే నిధి అగార్వల్ కోలీవుడ్ స్టార్ హీరో సూర్య హీరోగా నటిస్తున్న సినిమాలో హీరోయిన్ గా నటించే ఆఫర్ కొట్టేసినట్లు సమాచారం.ప్రస్తుతం హీరో సూర్య లక్కీ భాస్కర్ సినిమాతో మంచి డీసెంట్ హిట్ అందుకున్న తెలుగు ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి డైరెక్ట్ చేస్తున్న సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాని ప్రముఖ సినీ నిర్మాత నాగవంశీ సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నాడు. ఇప్పటికే స్క్రిప్ట్ నేరేషన్ కూడా కంప్లీట్ అయింది. దీంతో ఈ సినిమా జూన్ నెలలో పట్టాలెక్కనున్నట్లు సమాచారం. అయితే ఈ సినిమాలో నిధి అగర్వాల్ తో పాటూ మరో ఔంగ్ హీరోయిన్ కూడా సెలెక్ట్ చేసినట్లు సమాచారం. అయితే సూర్య సినిమాలో నిధి అగర్వాల్ ని తీసుకున్న విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం బాగానే వైరల్ అవుతున్నాయి.ఈ విషయం ఇలా ఉండగా నిధి అగార్వల్ తెలుగులో హరిహర వీరమల్లు, ది రాజాసాబ్ చిత్రాల్లో నటిస్తోంది. ఈ సినిమాలు ఇప్పటికే రిలీజ్ కావాల్సి ఉంది కానీ షూటింగ్ కంప్లీట్ కాకపోవడంతో రిలీజ్ వాయిదా పడుతూ వస్తున్నాయి.




# రెండు చిత్రాల్లో.. ద్విపాత్రాభినయం

కబురు సినిమా మార్చి09:
కథానాయకుడు సూర్య రాబోయే సినిమాల్లో వరుసగా ద్విపాత్రాభినయాలతో అలరించనున్నారా? అవుననే అంటున్నాయి తమిళ సినీ వర్గాలు. ప్రస్తుతం ఆయన ఆర్జే బాలాజీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. త్రిష కథానాయిక. చిత్రీకరణ దశలో ఉన్న ఈ పాన్ ఇండియా చిత్రంలో సూర్య న్యాయవాదిగా.. అయనార్‌గా రెండు పాత్రల్లో కనువిందు చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం అయనార్ పాత్రకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతున్నట్లు తెలిసింది. ఇది ఆధ్యాత్మిక అంశాలతో నిండిన యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఇక ఈ సినిమా తర్వాత సూర్య చేయనున్న 'వాడివాసల్'లోనూ.. ఆయన తండ్రీ-కొడుకుగా ద్విపాత్రాభినయంతో అలరించనున్నట్లు తెలుస్తోంది. దీనికి వెట్రిమారన్ దర్శకుడిగా వ్యవహరించనున్నారు.

# దర్శకుడితో శివ కార్తికేయన్!

కబురు సినిమా మార్చి09:
'అమరన్' విజయంతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు కథానాయకుడు శివ కార్తికేయన్. దీంతో ప్రస్తుతం ఆయనతో సినిమాలు చేసేందుకు పరభాషా దర్శకులు కథలు సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే ఇప్పుడాయన ఓ మలయాళ దర్శకుడు చెప్పిన కథకు పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. '2018' విజయంతో ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ గుర్తింపు తెచ్చుకున్నారు



దర్శకుడు జూడ్ ఆంథనీ జోసెఫ్. ఇప్పుడాయన దర్శకత్వంలోనే శివ కార్తికేయన్‌తో ఓ చిత్రం చేయనున్నారని సమాచారం. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని.. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ దీన్ని నిర్మించే అవకాశముందని తెలిసింది. ప్రతినాయకుడి పాత్ర కోసం ఆర్య పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం కార్తికేయన్ నటించిన 'మదరాసి' విడుదలకు సిద్ధమవుతుండగా.. 'పరాశక్తి' చిత్రీకరణ దశలో ఉంది.

# తెలుగులో ఛావా హవా.. రెండురోజుల్లోనే అన్ని రూ.కోట్లు కలెక్ట్ చేసిందా..?

విక్కీ కౌశల్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ బయోపిక్ గా వచ్చిన సినిమా చావా. ఈ సినిమా బాలీవుడ్ లో బాక్సఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిం చింది. ఫిబ్రవరి 14న విడుదలైన ఈ సినిమా కలెక్షన్ల సునామి సృష్టించింది. హిందీలోనే 600 కోట్లకు పైగా కలెక్షన్లు తెచ్చిపెట్టిం ది. తాజాగా తెలుగు ప్రేక్షకుల డిమాండ్ మేరకే ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో 500కు పైగా థియేటర్లలో గీత ఆర్ట్స్ గ్రాండ్ గా విడుదల చేసింది.అయితే హిందీతో పాటు తెలుగులో మంచి కలెక్షన్స్ సాధిస్తూ దూసుకుపోతోంది. మార్చ్ 7న 2.9 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించిన ఈ సినిమా రెండో రోజుకూడా ఇదే హవాని కొనసాగిస్తూ రూ.2.5 కోట్లు కలెక్ట్ చేసింది. దీంతో టాలీవుడ్ లో రెండు రోజుల్లో రూ.5.8 కోట్లు పైగా కలెక్ట్ చేసింది. వీకెండ్ ఉండటం, మౌత్ పబ్లిసిటీ బాగుండటంతో కలెక్షన్స్ బాగానే వస్తున్నాయి. అయితే ఈ సినిమాని గీతా ఆర్ట్స్ తెలుగులో డబ్ చేసి రిలీజ్ చేసేందుకుగానూ దాదాపుగా రూ.40 లక్షలు ఖర్చు చేసినట్లు సమాచారం.. కానీ రెండురోజుల్లోనే లాభాల్లోకి వచ్చేసింది. దీంతో దర్శకనిర్మాతలు ఫుల్ ఖుషీ అవుతున్నారు.సాధారణంగా హిందీ డబ్బింగ్ సినిమాలకు ఇక్కడ భారీ ఓపెనింగ్స్ రావడం అరుదు. కానీ 'ఛావా'కి ముందు నుంచే పాజిటివ్ బజ్ ఉండడంతో తెలుగు ప్రేక్షకులు బాగా ఆదరించారు. వి భిన్నమైన కథ, గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్, ఏఆర్ రెహ్మాన్ అందించిన సంగీతం సినిమాకు ప్లస్ పాయింట్గా నిలిచాయి.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com